TARAJYOTHI TELUGU DAILY
# తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
ఆదివారం, అక్టోబర్ 04, 2026 | సంపుటి - 20 | సంచిక 360 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ముమ్ముందు ఆర్థిక సవాళ్లు తప్పవు

**అంతా బాగుందనుకుంటే ప్రమాదమే**
**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి**
**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

న్యూఢిల్లీ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు.

తరువాయి 2లో

## క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతా



**ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు**
**అంతటా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు**
**అమరావతి క్వాంటం వ్యాలీపై ప్రపంచవ్యాప్త చర్చ**
**ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన

తరువాయి 2లో

## అభివృద్ధికి '3ఎస్' మంత్రం

**ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం**
**చంద్రబాబు అనుభవానికి ఎమ్మెల్యేల తోడు..**
**ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు**
**విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026**
**హాజరైన మంత్రి నారా లోకేశ్, ప్రముఖులు**

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దు తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ..

2లో

### విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా

# ప్రతివారం సమీక్షించాలి

**ఆస్పత్రులనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..**
**డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్**

హైదరాబాద్ : విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో ఈరోజు (శనివారం) వీజఒ=ణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడులపై పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



### ఆసియా క్రీడల్లో

# భారత్ జోరు

**21 స్వర్ణాలు సహా 85 పతకాలు**
**4వ స్థానంలో నిలిచిన భారత్**
**హాకీలోనూ 'డబుల్ గోల్డ్' కైవశం**
**పురుషుల స్వర్ణం కూడా కైవసం**
**ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు**

న్యూఢిల్లీ : రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో

తరువాయి 2లో



## తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్‌ఓసీ

**ఎత్తు పరిమితి 18 నుంచి 24 మీటర్లకు పెంపు**
**నివాస అపార్ట్‌మెంట్‌లకు ఫైర్ ఎన్‌ఓసీ నిబంధన**
**అక్టోబర్ 7 నుంచి అమల్లోకి రానున్న రూల్స్**

హైదరాబాద్ : తెలంగాణలో కొత్తగా నిర్మించే నివాస అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి రాష్ట్ర అగ్నిమాపక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భవన నిర్మాణానికి ముందు తీసుకోవాల్సిన ప్రొవిజనల్ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం అవసరమైన కనీస ఎత్తు

2లో

### హుజూర్‌నగర్ నుంచే

# పోటీ చేస్తా

**తుంగతుర్తి నియోజకవర్గానికి మారను**
**మారుతున్నాననే వదంతులు నమ్మొద్దు**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

హైదరాబాద్ : తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

2లో

### దేశంలో జరిగినవన్నీ

# అక్రమ ఎన్నికలే

**ఈవీఎంల పార్తిగా దుర్వినియోగం జరిగింది**
**లోక్‌సభ, అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి**
**మోదీ, అమిత్ షా అక్రమంగా పదవుల్లో ఉన్నారు**
**కేంద్ర ప్రభుత్వంపై మల్లికార్జున ఖర్గే ఆరోపణలు**

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

2లో

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

**కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు**
**ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు**
**మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు**

హైదారాబాద్ : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు.

2లో

## ముున్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతా

ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు. ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్‌ఓసీ

పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచింది. ఈ సవరించిన నిబంధన అక్టోబర్ 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం, 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నివాస భవనాలు నిర్మాణ అనుమతికి ముందే తప్పనిసరిగా ఫైర్ ఎన్‌ఓసీ పొందాల్సి ఉండేది. తాజా మార్పుతో 18 నుంచి 24 మీటర్ల మధ్య ఎత్తు ఉండే అపార్ట్‌మెంట్‌లకు (సుమారు 5 నుంచి 7 అంతస్తులు) కేవలం ఎత్తు కారణంగా ప్రొవిజనల్ ఎన్‌ఓసీ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, ఈ సడలింపు కేవలం నివాస భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. పాఠశాలలు, ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, పరిశ్రమలు వంటి ఇతర భవనాలకు ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక భద్రతా నిబంధనలే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. బిల్డర్ల సంఘాలతో జరిపిన సంప్రదింపులు, అలాగే ఇటీవల అమల్లోకి వచ్చిన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఏప్రిల్ 30న నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2016 స్థానంలో నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026ను అమల్లోకి తెచ్చింది. ఈ నూతన జాతీయ ప్రమాణాల్లో నివాస భవనాల అగ్నిమాపక భద్రతకు 24 మీటర్ల ఎత్తును ఒక ముఖ్యమైన కొలమానంగా నిర్దేశించారు. తక్కువ, మధ్యస్థాయి నివాస భవనాలపై నియంత్రణ భారాన్ని తగ్గించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే ఈ మార్పు ముఖ్య ఉద్దేశమని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ వివరించారు. అయితే, ఎన్‌ఓసీ పరిధిలోకి రానంత మాత్రాన భవనాలకు ప్రాథమిక అగ్నిమాపక భద్రతా ప్రమాణాల నుంచి మినహాయింపు ఉండదని అధికారులు తేల్చిచెప్పారు. నిర్మాణ సమయంలో ప్రమాదరహిత నిష్క్రమణ మార్గాలు, అత్యవసర లైటింగ్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎలక్ట్రికల్ భద్రత వంటి ఏర్పాట్లను తనిఖీ చేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అంశంపై కౌన్సిల్ ఫర్ ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పి. అంచురి స్పందిస్తూ, కేవలం భవనం ఎత్తు మాత్రమే అగ్నిప్రమాద తీవ్రతను నిర్ణయించదని హెచ్చరించారు. నివాసితుల సాంద్రత, తరలింపు ఏర్పాట్లు, పొగను నియంత్రించే వ్యవస్థలు (స్మోక్ మేనేజ్‌మెంట్), ఫైర్ టెండర్లు భవనంలోకి ప్రవేశించడానికి ఉన్న మార్గాలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 18 నుంచి 24 మీటర్ల ఎత్తు భవనాల్లో కూడా తప్పనిసరిగా సురక్షితమైన మెట్లు, ఎమర్జెన్సీ లైటింగ్, ఫైర్ అలారం వ్యవస్థలు, తగిన అగ్నిమాపక పరికరాలు ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. అపార్ట్‌మెంట్లలో మెట్ల మార్గాలను, టెర్రస్‌లను మూసివేయడం, ఉమ్మడి ప్రదేశాల్లో సామాగ్రిని నిల్వ చేయడం, అనధికారిక విద్యుత్ మార్పులు, ఫైర్ టెండర్లకు అడ్డంగా వాహనాలు పార్క్ చేయడం వంటివి పెను ప్రమాదాలకు దారితీస్తాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన భద్రతా ప్రమాణాలను నివాసం ప్రారంభించాక కూడా నిరంతరం పాటించాలని వారు సూచిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం, 2025లో తెలంగాణలో 8,860కి పైగా అగ్నిప్రమాదాలు జరిగాయి. వీటిలో 160 మందికి పైగా మరణించారు. ఈ నేపథ్యంలో భద్రతా ప్రమాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు

10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది. ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది. భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హుడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు. గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. స్వర్ణాల సంఖ్య కూడా 28 నుంచి 21కి పడిపోయింది. ముఖ్యంగా షూటింగ్‌లో ఏడు స్వర్ణాల నుంచి మూడింటికి తగ్గాయి. అథ్లెటిక్స్‌లో గతంలో ఆరు స్వర్ణాలు సాధించగా.. ఈసారి ఒక్క పసిడి మాత్రమే దక్కింది. రోయింగ్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలు తగ్గాయి. టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో ఈసారి ఒక్క పతకం కూడా రాలేదు. పతకాల సంఖ్య తగ్గినా.. ఈసారి పలువురు భారత క్రీడాకారులు వ్యక్తిగతంగా చరిత్ర సృష్టించారు. మహిళల హాకీ జట్టు నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణాన్ని అందుకుంది. ఆర్చరీ, గోల్ఫ్, షూటింగ్, రెజ్లింగ్‌లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. మొత్తంగా 20 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన భారత్.. చివరి వరకు పోరాడి టాప్-5లో నిలిచింది. కొన్ని విభాగాల్లో వెనుకబడినా.. మరికొన్ని క్రీడల్లో సాధించిన అపూర్వ విజయాలు ఈ ఆసియా క్రీడలను భారత క్రీడాభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేశాయి. కాగా.. ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం. జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు. ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

## అభివృద్ధికి '3ఎస్' మంత్రం

ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు."ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఎ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ [illegible] ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు. కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు. "ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు. ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డాం

## సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందూత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి.రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు.హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది.వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని, నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందూత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు లబ రాముడు, ఉత్తరాది లబ దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పోలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

## దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తా

ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

## హనుమంతుడే కాపాడాడు

హైదరాబాద్, అక్టోబరు 3 : దుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి, గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్ తో మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాక్ పిట్ లో తనకు ఎదురైన పరిస్థితిని మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చూపించిన సమయ స్ఫూర్తి, ధైర్యం అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. త్వరగా కోలుకోవాలని యావత్ భారత్ ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు. ఇతరులను రక్షించడం కోసం తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటుంది" అని స్మిత్ తో మోదీ అన్నారు.మరో వైపు ప్రధాని మోదీయే నేరుగా ఫోన్ చేయడంపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మచ్చర్ మాట్లాడుతూ "మీరు నాకు అత్యంత ఆరాధనీయులు. మీ నుంచి ఫోన్ రావడం గర్వంగా వుంది. కలలో కూడా నేను ఊహించలేదు. అనుకోని పరిస్థితులు, విపత్కర పరిస్థితుల్లో హనుమాన్ చాలీసా పఠిస్తా. కాక్ పిట్ లో ఘర్షణ సమయంలోనూ హనుమాన్ చాలీసాయే పఠించా. ఆ సమయంలో నేను గాయపడినా, ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలూ పోవద్దని మాత్రం దేవుడ్ని ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని గట్టిగా భావించా" అంటూ మోదీకి వివరించారు.

## అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

హైదారాబాద్, అక్టోబర్ 03 : రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు పత్రాలను పలువురు గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్యే తలసాని కి అందజేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీ సజ్జనార్‌కు హైకోర్టు నోటీసులు

హైదారాబాద్, అక్టోబర్ 03 : హైదరాబాద్ భవానీనగర్ పోలీస్ స్టేషన్లో కస్టడీ వేధింపులపై తగిన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న ఇచ్చిన ఆదేశా లను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ షానవాజ్ ఆలం హైకో ర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీదేవి విచా రణ చేపట్టారు.పిటిషనర్ తరపు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి క్రిమి నల్ కేసులు లేకపోయినా పిటిషనర్ను ఆగస్టు 6న పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారన్నారు. దీనిపై కమిషనర్ తో సహా అధికా రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో ఈ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన కోర్టు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఒకవేళ ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలంటూ ఆగస్టు 13న కమిషనర్ ను ఆదేశించినా చర్యలు తీసుకో లేదన్నారు. అందువల్ల కమిషనర్పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసు కోవాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రతివాది అయిన పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనారు నోటీసులు జారీ చేస్తూ విచారణను నవంబరు 6కు వాయిదా వేశారు.

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

**సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్**
**యూపీలో సీట్ల పంపకాలపై నెలకొన్న రగడ**
**ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజుకున్న వేడి**

ఉత్తర్‌ప్రదేశ్, అక్టోబర్ 03 : ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## ఆర్టీసి మెట్రో కామన్ పాస్ అమలు

### మెట్రో లో ప్రయాణించిన మంత్రులు

హైదరాబాద్ : నగరంలో ఆర్టీసీ మెట్రో కామన్ పాస్ అమల్లోకి వచ్చింది. కామన్ పాస్ తోటి అటు మెట్రో ఇటు ఆర్టీసి లో ప్రయాణం చేయొచ్చు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్ , నవీన్ యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,అధికారులు ప్రయాణం చేసి చూపించారు బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు వెళ్లారు. మంత్రులు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి ఆర్టీసి బస్సులో ప్రయాణించారు. సెమెట్రోతో పాటు ఆర్టీసి బస్సులో ప్రయాణించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ఆర్టీసీ?మెట్రో కామన్ పాస్తో ప్రయాణం మరింత సులభం. ?బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్పోస్ట్ వరకు కామన్ పాస్తో ప్రయాణిచాం. ?మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యం. ?మెట్రో దిగిన తర్వాత బస్సు కోసం ప్రయాణికులకు ఇక అయోమయం ఉండదు. ఒకే పాస్తో మెట్రో?ఆర్టీసీ ప్రయాణం.. ప్రయాణికులకు సౌకర్యవంతమైన విధానం ఇది. కామన్ పాస్ చాలా మంచి, అనుకూలమైన విధానం అని అయన అన్నారు. మెట్రో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునేలా తొలి కనెక్టివిటీగా ఆర్టీసీ బస్సులు వుంటాయి. మెట్రో ఆర్టీసీ అనుసంధానాన్ని మరింత విస్తరిస్తాం. ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సులభమైన ప్రయాణమే ప్రభుత్వ లక్ష్యం. భవిష్యత్లో మెట్రో ఆర్టీసీతో పాటు ఆటోలు, ఊబర్ సేవలను అనుసంధానించే ఆలోచన వుందని అన్నారు. చివరి గమ్యస్థానానికి చేరుకునేలా 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'పై దృష్టి పెడుతున్నారు. ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అనుసంధానం చేస్తాం. ?ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా ఆర్టీసీ?మెట్రో కామన్ పాస్ వుంటుఇంది

# ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత

**పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు**
**కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ**
**తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాసంగిలో తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. స్వల్పకాలిక.. తక్కువ పెట్టుబడి పంటలను ఎంచుకోవాలని నిర్దేశించారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును అన్నదాతలు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీని ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. చీఖీఎవీ, చీవీజుూ-రూ పథకాల కింద విత్తనాలను పంపిణీ చేస్తునట్లు వెల్లడించారు. ఆయా ప్రాజెక్టుల్లో నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నీటి పారుదల ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను రైతన్నలు ఎంచుకోవాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. వేరుశనగలో నూతన విత్తన రకాలను అభివృద్ధి చేయాలని చెప్పుకొచ్చారు. ఇతర పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ గెలలను వేగంగా ఫ్యాక్టరీలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్నదాతలకు చెల్లింపులను త్వరితగతిన జరిగేలా చూస్తామని మాటిచ్చారు. నూనెగింజల విత్తనాల కోసం రూ.49.35 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.34.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 52,425 ఎకరాలకు 29,375 క్వింటాళ్ల విత్తనాలను ధ్రువీకరించినట్లు తెలిపారు. రూ.36.76 కోట్ల సబ్సిడీతో నూనెగింజల విత్తనాలను పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల విత్తనాలను పంపిణీ చేస్తామని వివరించారు. పప్పుధాన్యాల కోసం రూ.34.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను పంపిణీ చేస్తామని అన్నారు. శనగ, మినుము, పెసర విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనాలకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ ఇస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు

**మల్లేష్ ద్వారా వెలుగులోకి వచ్చిన నిజాలు**

హైదారాబాద్, అక్టోబర్ 03 : సికింద్రాబాద్ మద్రాస్ రెజి మెంట్ ఆయుధాల చోరీ కేసులో మల్లేష్ ద్వారా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 10రోజుల పోలీస్ కస్టడీలో కీలక సమాచారాన్ని సేకరించి అధికారులు నేరాంగీకార వాంగ్మూ లాన్ని నమోదు చేశారు. 2009లో ఆర్మీ జవా నుగా చేరినప్పటినుంచే ఆయుధాలు, మందు గుండు సామగ్రిపై మల్లేష్ శిక్షణ పొందాడు. మిలటరీ కంటోన్మెంట్లలోని ఆయుధాగారాలు బాధ్యతలు నిర్వహించడంతో ఆయుధాల గురించి పూర్తిగా అవగాహన ఉందని మల్లేష్ వివరించాడు. ఆయుధాల పట్ల అన్ని విషయా లను తెలుసుకుంటూ వాటి వాడకం పట్ల అప్ప టినుంచే అవగాహన పెంచుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలోనే ఆయుధాలు చోరీ చేయాలని నిర్ణ యించుకున్నాడు. చోరీ చేసిన ఆయుధాలను అమ్మి డబ్బు సంపాదించుకోవాలని అనుకు న్నాడు. చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రో హశక్తులకు అమ్మేందుకు పథకం రచించాడు. ఆర్థిక ఇబ్బందులను తొలగించుకునే ప్రయత్నం లోనే ఆయుధాల చోరీకి పాల్పడినట్టు అంగీకరించాడు. 2026 జూలైలో మద్రాస్ రెజిమెం ట్లో పలుమార్లు రెక్కీ నిర్వహించినట్టు మల్లేష్ నేరాన్ని అంగీకరించాడు. సహచరులు శేషు, వినోద్, ప్రవీణ్ లు మల్లేష్కు సహకరించడం తోనే ఆయుధాలను చోరీ చేసినట్టు అధికారులు గుర్తించారు. చోరీ పాల్పడిన నాటికి ముందు వారంరోజుల క్రితమే సీసీ కెమెరాలను నిర్వీర్యం చేసినట్టు ఒప్పుకున్నాడు. సీసీ కెమె రాలపై ఫోమ్చల్లి దృశ్యాలు రికార్డు కాకుండాచేసినట్టు తెలిపాడు. విద్యుత్ దీపాలను సైతం ఆర్పివేసి మల్లేష్ తోపాటు సహచరులు భద్రత జవాన్ల దృష్టిని మళ్లించారు. సుమారు గంటన్నరపాటు చోరీ చేసిన ఆయుధాలను తరలించి నట్టు వెల్లడించాడు. తొలుత ఆయుధాలను బైక్పై ఆ తర్వాత కారులో ఆయుధాలను నాగ రికర్నూల్లోని తన ఇంటికి తరలించినట్టు అంగీకరించాడు. కొల్కత్తాకు చెందిన బీర్బల్ షాను ఫోన్ ద్వారా సంప్రదించాడు. బీర్బల్షా ద్వారా అవలెయ్ అలియాస్ ఓబీకి ఆయు ధాలు విక్రయించేందుకు డీల్ కుదుర్చుకు న్నాడు. ఏకే-47 (నాలుగు) రూ.5లక్షలకు, పిస్టళ్లు రూ. 3 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. అగస్టు29న బీర్బల్ మల్లేష్కు ఫోన్ చేసినట్టు కాల్ డేటా ద్వారా అధికారులు ఆరా తీయగా, ఆయుధాల డెలివరీ ఆలస్యం కావడంతో బీర్బలా తనకు ఫోన్ చేసినట్టు మల్లేష్ బదులి చ్చాడు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్కు వచ్చేవారితోనూ, రోహింగ్యాలతో సన్నిహిత సంబంధాలున్నట్టు పోలీసుల విచారణలో వెల్ల డైంది. 2007లో అమ్రాబాద్, అచ్చంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇండ్ల దొంగతనాల కేసుల్లో మల్లేష్ నిందితుడిగా ఉన్నట్టు అధికా రులు గుర్తించారు. బీర్బల్, అవల్దేవ్ కోసం ఆరు ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తు న్నాయి. వారిని అదుపులోకి తీసుకోవడంతో అక్రమ ఆయుధాల క్రయవిక్రయాలపై మరింత సమాచారం లభిస్తుందని అధికారులు భావిస్తు న్నారు. సహచరులు శేషు, వినోద్, ప్రవీణ్ ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. సేకరించిన కీలక ఆధారాలను, మల్లేష్ నేరాంగీకార పత్రాన్ని కోర్టుకు సమర్పించారు.

## ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

హైదరాబాద్ : ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది.ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది.ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

## ఇద్దరు పిల్లలతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య

పరిగి : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గుర్తిలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. తల్లి మమత, కూతురు జనశ్రీ మృతదేహాలు ఇప్పటికే లభ్యం అయ్యాయి. కుమారుడు సాకేత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఊర్లోని ఓ బావిలో మమత ఇద్దరు పిల్లలతో సహా దూకేసింది. బావిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో సాకేత్ మృతదేహం ఇంకా కనిపించలేదు. భర్త తో గొడవ కారణంగానే మమత ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకినట్టు తెలుస్తోంది. శుక్రవారం భర్తతో గొడవ కాగా ఉదయం ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వ్యక్తులు , బంధువులు వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సమీప పొలాల వద్ద వెతకడం ప్రారంభించారు. సోమనుర్తి గ్రామ శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, ఒక బ్యాగు ఉండటంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో బావిలో వెతకగా తల్లి, కూతురు మృత దేహాలు లభించాయి. ఆ మృతదేహాలు మమత, జనశ్రీవిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సాకేత్ మృతదేహం కోసం పోలీసులు బావిలో వెతుకుతున్నారు.

## రేవంత్ రెడ్డి కుటుంబం వ్యాపారాలు పెరిగినయి..

**తప్పని నిరూపిస్తే మరోసారి ప్రెస్‌మీట్ పెట్ట**
**కేటీఆర్ హోటల్ గురించి అఫిడవిట్‌లో పెట్టారు**
**బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కీలక వ్యాఖ్యలు**

హైదారాబాద్, అక్టోబర్ 03 : మా దగ్గరున్న వివరాలన్నీ మీకు పోస్ట్ ద్వారా మీమీ కార్యాలయాలకు పంపిస్తం.. కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకత్వానికి దమ్ముంటే రేవంత్ మెడికోవర్ అంశంపై విచారణ చేపట్టాలని బీఆర్ ఎస్ మన్నెక్రిశాంక్ సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెడికోవర్ ఆస్పత్రుల మీద, మ్యాక్సపియన్ ఫార్మా మీద కార్పోరేట్ స్కూల్స్ నిర్మాణం చేస్తున్న మైండ్ వాల్డ్ కన్‌స్ట్రక్చన్స్ మీద విచారణ చేపట్టండి.. అంటే రెండున్నరేళ్ళలో రేవంత్ రెడ్డి కుటుంబం వ్యాపారాలు పెరిగినయి. ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వం వచ్చాక షోరూంలు, కారు షోరూంలు హెల్త్ ఆస్పత్రులు, స్కూల్స్ తో దండపాళ్యం బ్యాచ్ దోచుకుంటున్నది కాబట్టి... వాస్తవానికి ఇవాళ క్వశ్చన్ చేసేటప్పుడు అందరు అన్నరు.. ఇప్పటికే రెండు సార్లు జైలుకు పంపించిర్రు. మొన్న ఇంటి తలుపులు బద్దలు కొట్టారు. చిన్నపాపను కూడా బెదిరించారు. రేవంత్ రెడ్డి చేయాల్సివన్నీ చేసేశాడు.. ఇంకేం చేస్తడు.. మా అంటే ఇక భౌతిక దాడో.. ఎన్‌కౌంటరో చేపిస్తడన్నారు. మెడికోవర్ హాస్పిటల్స్, మాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్, శోదా కన్‌స్ట్రక్షన్స్, స్వచ్ బయో, టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ స్కాంల మీద రేవంత్ రెడ్డి సోదరులు, కుటుంబసభ్యులు రూ.50 వేల కోట్ల స్కాంలు చేశారు. వీటి అన్ని ఆధారాలను కాపీలతో ఈడీకి, మల్లికార్జున ఖర్గేకు, ప్రధాని కార్యాలయానికి, రాష్ట్రపతి కార్యాలయానికి, ప్రతిపక్ష నాయకులకు అందరికీ పంపిస్తానన్నారు మన్నె క్రిశాంక్. మెడికోవర్ హాస్పిటల్స్, మాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఎందుకు దుంప శిరీష డైరెక్టర్‌గా ఉన్నారు..? నేను చెప్పినవి తప్పు అని నిరూపిస్తే మరోసారి ప్రెస్‌మీట్ పెట్టనని.. రేవంత్ రెడ్డి కుటుంబానికి బహిరంగ క్షమాపణలు చెప్తా.. వీటిపై విచారణకు రేవంత్ రెడ్డి సిద్ధమా? అని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు.కేటీఆర్ హోటల్ అని కొందరు కాంగ్రెస్ నేతలు, వాళ్ల పెయిడ్ బ్యాచ్ పంపించి వీడియోలు చేస్తున్నరని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిప్పి కొడితే అది కిరాయి బంగ్లా.. అందులో హోటల్ నడిపిస్తున్నారు. వీళ్లేదైతే హోటల్ అంటున్నరో 2009లోనే కేటీఆర్ హోటల్ గురించి అఫిడవిట్‌లో పెట్టారు..కానీ దాన్ని ఒక పెద్ద భూతద్దం పెట్టి హరీశ్ రావు ఎన్నికల అఫిడవిట్‌ను, కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌ను చూపెట్టి ఇగో చూడండి.. రాష్ట్రమంతా కూడా ఇంత ఆస్తులు.. ఏమున్నది కేసీఆర్ పొలం లేదా కేటీఆర్ ఒక కిరాయి బంగ్లాలో నడిపిస్తున్న హోటల్.. లేదా హరీశ్ రావుకున్న పొలం, ఏమైనా భూములు గంతేనన్నారు. రేవంత్ రెడ్డి మూడేళ్లలో ఒక్క ప్రభుత్వ హాస్పిటల్, ఒక ప్రభుత్వ పాఠశాల కూడా నిర్మించలేదన్నారు మన్నె క్రిశాంక్.. పోనీ విద్యాశాఖ మంత్రిగా నువ్వేమైనా చేసినవా అంటే ప్రభుత్వ పాఠశాలలను, గురుకుల పాఠశాలలను రేవంత్ రెడ్డి పట్టించుకుంటలేరు.. కొంపల్లిలో రేవంత్ రెడ్డి అమ్మాయికి చెందిన నిర్మాణం అవుతున్న స్కూల్ బిల్డింగ్ ఇది. దానికి సంబంధించిన ల్యాండ్ డాక్యుమెంట్స్ ఉన్నాయి.. సర్వే నంబర్ 87. అనుముల నిమిషా రెడ్డి రిప్రజెంటెడ్ బై సూరం అనిల్ కుమార్ రెడ్డి అని పెట్టారు. ఎవరీ సూరం అనిల్ కుమార్ రెడ్డి.. రేవంత్ రెడ్డి మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడేందుకు వచ్చినప్పుడు మనవడిని కూడా ఎత్తుకొచ్చిండు కదా.. ఆయననే ఇందులో మొదటి ఫొటో సూరం అనిల్ కుమార్ రెడ్డి, రిప్రజంటేటివ్ ఆఫ్ నిమిషా రెడ్డి అని ఉన్నదన్నారు.ఇంతకీ రేవంత్ రెడ్డి కూతురుతో ఇన్ని వ్యాపారాలు చేస్తున్న ఎంజెల్ ఇన్వెస్టర్ దుంప శిరీష ఎవరు అని ప్రశ్నించారు. దుంప శిరీష మాక్సిపియన్ ఫార్మాలో రేవంత్ రెడ్డి అల్లుడితో ఉంటరు. మెడికోవర్ ఆస్పత్రిలో ఉంటరు.. నిమిషారెడ్డితో ఇందులో కూడా పార్టనర్‌గా ఉంటరని ప్రశ్నించారు.

## సామాన్యులపై ధరల మోత

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. కానీ ఆశించినంతంగా వర్షాలు కురవలేదు. ఈ లోటు వర్షపాతంతో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం సజావుగా సాగక వ్యవసాయాధారిత సరుకులపై తీవ్ర ప్రభావం చెపే ప్రమాదం లేకపోలేదు. తద్వారా సామాన్యులపై ధరల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆహార సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనబడుతున్నాయి. ఈ మధ్య న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి. ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్‌అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది.

# సంపాదకీయం

## మిడ్-ఎయిర్ డ్రామా

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారుఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామివ్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బె?ంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో అభిమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితి కి మార్చారు.పైలట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్ గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

# వైద్య వీసాలతో విదేశీయుల తిష్ఠ

వైద్యం కోసం విదేశాల నుంచి భారత్‌కు రావడం కొత్త విషయం కాదు. ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే చికిత్స వంటి కారణాలతో భారత్ వైద్య పర్యాటకానికి ముఖ్య కేంద్రంగా ఎదుగుతోంది. అనేక దేశాల నుంచి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడు తున్నవారు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు అవసరమైనవారు, మెరుగైన వైద్య సేవల కోసం భారత్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇది దేశానికి ఆర్థికంగానూ, మానవతా పరంగానూ ప్రయోజనకరమైన పరిణామమే. అయితే, ఇదే వ్యవస్థలోని కొన్ని లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు విదేశీయులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు, పోలీసుల దర్యాప్తుల్లో వెలుగు చూస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వైద్య వీసాను భారత్‌లోకి ప్రవేశించేందుకు ఒక మార్గంగా ఉపయోగించుకుని, చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోవడం, పేర్లు మార్చుకోవడం, నగరాలు మార్చడం, నకిలీ గుర్తింపు పత్రాలు సంపాదించడం, డ్రగ్స్ వంటి అక్రమ కార్యకలాపాల్లోకి ప్రవేశించడం వంటి అంశాలు భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. విదేశీయుడు కావడం నేరం కాదు. వైద్య వీసాపై భారత్‌కు రావడం కూడా నేరం కాదు. నేరం చేసే వ్యక్తి ఏ దేశానికి చెందినవాడైనా చట్టం ముందు సమానమే. కాబట్టి ఒకటి రెండు ఘటనల ఆధారంగా ఒక దేశానికి చెందిన మొత్తం సమాజాన్ని అనుమానించడం సరికాదు. అసలు సమస్య వీసా వ్యవస్థను దుర్వినియోగం చేయడం, పర్యవేక్షణలోని లోపాలను వినియోగించుకోవడం, నకిలీ గుర్తింపులతో చట్టాన్ని తప్పించుకోవడం. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనలను పరిశీలిస్తే, కొందరు వ్యక్తులు వైద్య చికిత్స పేరుతో భారత్‌కు వచ్చి, ఆసుపత్రిలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఉండి ఆ తర్వాత అదృశ్యమవుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మరికొందరు ఆసుపత్రికి వెళ్లకుండానే తమ అసలు ఉద్దేశాలను మార్చుకుంటున్నారన్న అనుమానాలూ ఉన్నాయి. చికిత్స కోసం వచ్చిన వ్యక్తి చికిత్స అనంతరం ఎక్కడికి వెళ్లాడు? వీసాలో పేర్కొన్న చిరునామాలోనే ఉన్నాడా? వీసా గడువు ముగిసిన తర్వాత దేశంలోనే ఉన్నాడా? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే పటిష్ఠమైన వ్యవస్థ లేకపోతే, వీసా అనేది ప్రవేశ పత్రంగా మాత్రమే మిగిలిపోతుంది; పర్యవేక్షణ సాధనంగా మారదు. మరో తీవ్రమైన అంశం గుర్తింపు మార్పు. ఒక నగరంలో ఒక పేరుతో, మరో నగరంలో మరో పేరుతో ఉండటం, నకిలీ ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రాలను సంపాదించడం, ఫోన్ నంబర్లు, చిరునామాలు మార్చుకోవడం వంటివి జరిగితే సాధారణ పోలీసు తనిఖీల ద్వారా వ్యక్తి అసలు నేపథ్యాన్ని గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా మాదకద్రవ్యాల నెట్‌వర్కులు తమ కార్యకలాపాలను చిన్న చిన్న గొలుసులుగా విభజించుకుంటే, అసలు సూత్రధారుల వరకు చేరుకోవడం దర్యాప్తు సంస్థలకు సవాలుగా మారుతుంది. ఇక్కడ ఆసుపత్రుల పాత్ర కూడా అత్యంత కీలకం. నిజంగా వైద్య అవసరంతో వచ్చిన విదేశీ రోగులను ఆహ్వానించడం, వారికి నాణ్యమైన చికిత్స అందించడం ఆసుపత్రుల బాధ్యత. అదే సమయంలో వీసా కోసం తప్పుడు వైద్య పత్రాలు, అవసరానికి మించి ధ్రువీకరణలు లేదా ఇతర మార్గాలను ఉపయోగించే అవకాశం ఉంటే వాటిపై ఆసుపత్రి యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలి. వైద్య రంగంలో వాణిజ్య ప్రయోజనాలు ఉండటం సహజమే. కానీ ఆర్థిక ప్రయోజనాల కోసం వ్యవస్థలోని నియమాలను పక్కనపెడితే దాని ప్రభావం మొత్తం వైద్య పర్యాటక రంగంపైనే పడుతుంది. అదే సమయంలో దళారుల వ్యవస్థను కూడా కట్టడి చేయాలి. రక్షణ అవసరం విదేశాల్లో కూర్చుని భారత్‌లో వైద్య చికిత్స పేరుతో వ్యక్తులను పంపించే ఏజెంట్లు ఎవరు? వారికి ఆసుపత్రులతో సంబంధాలున్నాయా? వైద్య వీసా కోసం సమర్పించే పత్రాలు నిజమైనవేనా? భారత్‌కు వచ్చిన తర్వాత రోగి వాస్తవంగా చికిత్స పొందుతున్నాడా? చికిత్స పూర్తయిన తర్వాత వీసా నిబంధనలను పాటిస్తున్నాడా? ఈ మొత్తం ప్రక్రియలో బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. వైద్య వీసా దుర్వినియోగాన్ని కేవలం పోలీసింగ్ సమస్యగా చూడటం కూడా సరైంది కాదు. ఇది వీసా వ్యవస్థ, ఇమ్మిగ్రేషన్, విదేశీ వ్యవహారాలు, వైద్య సంస్థలు, స్థానిక పోలీస్ వ్యవస్థ, ఆధార్ వంటి గుర్తింపు వ్యవస్థలు, డ్రగ్ నియంత్రణ సంస్థలు పరస్పరం సమన్వయంతో పరిష్కరించాల్సిన అంశం. ఒక శాఖ వద్ద ఉన్న సమాచారం మరో శాఖకు సమయానికి చేరకపోతే, నేరస్థులు ఆ ఖాళీని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అందుకే పరిష్కారం వీసాలు నిలిపివేయడం కాదు.. వీసా వ్యవస్థను మరింత తెలివిగా మార్చడం. డిజిటల్ డేటా అనుసంధానం, బయోమెట్రిక్ ధ్రువీకరణ, ఆసుపత్రుల బాధ్యత, వీసా గడువు పర్యవేక్షణ, విదేశీయుల చిరునామా ధ్రువీకరణ, పోలీసు-ఇమ్మిగ్రేషన్ సమాచార భాగస్వామ్యం వంటి చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలి. అనుమానాస్పద కేసుల్లో వేగంగా దర్యాప్తు జరగాలి. నేరం నిరూపితమైనప్పుడు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అంతేకాదు, ఆసుపత్రులు కూడా తమ వద్దకు వచ్చే విదేశీ రోగుల వివరాలను కేవలం వ్యాపార లావాదేవీగా చూడకూడదు. వైద్య రంగానికి ఉన్న సామాజిక బాధ్యతను గుర్తించాలి. అనుమానాస్పద పత్రాలు, తప్పుడు వైద్య సమాచారం లేదా వీసా నిబంధనల ఉల్లంఘన కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. మరిన్ని కనుగొనండి అంతర్జాతీయ వార్తలు కెరీర్ గైడెన్స్ సంపాదకీయ వ్యాసాలు అదే సమయంలో నిజమైన రోగులను వేధింపులకు గురిచేయకుండా సున్నితమైన విధానాన్ని పాటించాలి.

## ఫాం హౌస్ సర్వేపై ఉత్కంఠ

హైదరాబాద్ : కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశం కేంద్రబిందువుగా మారింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెలికట్ట గ్రామాల పరిధిలో కేసీఆర్ ఫాంహౌస్‌ను ఆనుకుని ఉన్న భూముల సర్వే ప్రక్రియ పూర్తికావడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమగ్ర సర్వే నివేదిక సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతికి చేరింది. దీంతో.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కేసీఆర్ ఫాంహౌస్ లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయని.. వాటిపై 30 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించారు. మర్కూక్ మండల పరిధిలోని భూముల లెక్కలు తేల్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాలు, వెలికట్ట సర్వే నంబర్ 271 భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి హద్దులను నిర్ధారించారు. ఈ సర్వేలో భాగంగా ఎర్రవల్లిలో 244 మందికి, వెలికట్టలో 118 మందికి పైగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.ఈ సర్వే రాజకీయంగానే కాకుండా స్థానికంగానూ అనేక మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అధికారుల ముందుకొచ్చారు. తమ గ్రామానికి చెందిన సుమారు 180 ఎకరాల భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని, పాత రికార్డుల ఆధారంగా న్యాయం చేయాలని వారు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న చిన్న సన్నకారు రైతులు తమ పట్టా పాస్‌బుక్కులు చూపించినప్పటికీ, ప్రభుత్వ తాజా నిర్ణయాలు తమను ఏ విధంగా ప్రభావితం చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.పదేళ్లపాటు సీఎంగా ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ ఉన్న భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకవేళ ఈ సర్వే నివేదికలో భూ ఆక్రమణలు జరిగినట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపులు జరిగినట్లు తేలితే, అది కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ దీనిని రాజకీయ అస్త్రంగా మలుచుకుంటుంది.

## భారత్ దెబ్బ... అగ్రరాజ్యం అబ్బ

న్యూఢిల్లీ, అక్టోబరు 3, (న్యూస్ పల్స్) అంతరిక్షంలోనే ఉపగ్రహాలను కూల్చివేసే క్షిపణి టెక్నాలజీ కలిగిన ప్రపంచంలోని నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. భారత్ 2019లో అమెరికా, చైనా, రష్యాల సరసన చేరింది. అయితే, మార్చి 2019లో చేపట్టిన ఈ ప్రయోగం అగ్రరాజ్యం అమెరికాను కలవరానికి గురిచేసింది అని ఆ దేశ మాజీ నిఘా అధికారి తాజాగా వెల్లడించారు. ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన యాంటి శాటిలైట్ మిసైల్ పరీక్ష సమయంలో ఆందోళన చెందినట్టు తెలిపారు.పోఖ్రాన్-2 అణు పరీక్షలతో అమెరికాతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన భారత్.. అణుశక్తిలో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించింది. ఇది జరిగిన దాదాపు 28 ఏళ్ల తర్వాత అగ్రరాజ్యానికి భారత్ అలాంటి సర్‌ప్రైజ్ ఇచ్చింది. మార్చి 27, 2019 భారత్ చేపట్టిన 'మిషన్ శక్తి' ( యాంటీ శాటిలైట్ క్షిపణి ప్రయోగం అమెరికా నిఘా వర్గాలను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన వివరాలను అమెరికా వాయుసేన మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్ గ్రుష్ తాజాగా ప్రముఖ పాడ్‌కాస్టర్ జో రోగన్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అప్పట్లో నేషనల్ రీకాన్నార్చ్ ఆఫీస్ ఆపరేషన్స్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రుష్.. ఆ సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు."ఇది ఒక విచిత్రం... 2019లో ఎవరూ ఊహించని విధంగా భారత్ నిర్వహించిన క్షిపణి పరీక్ష వారి ఉపగ్రహాలలో ఒకదానిని తాకింది.. ఈ విషయం గురించి వారు మాకు ముందు తెలియజేయలేదు" అని ఆయన అన్నారు. ఒడిశా తీరంలో భారత్ క్షిపణి పరీక్షకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పటికీ.. అది ఉపగ్రహాన్ని పేల్చివేసే 'యాయి' క్షిపణి అని అమెరికా ఊహించలేకపోయింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే వరకు దీనిపై ఎవరికీ అవగాహన లేదు.ఈ ప్రయోగం వల్ల ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాల నుంచి తమ నిఘా ఉపగ్రహాలకు ప్రమాదం పొంచి ఉందేమోనని ఎన్ఆర్వో అధికారులు తీవ్ర ఆందోళన చెందారని ఆయన అన్నారు. వెంటనే వ్యర్థాల విస్తరణను లెక్కించి, అమెరికా ఉపగ్రహాల మార్గాన్ని మార్చాల్సిన అవసరం ఉందో లేదో చూడాలని విశ్లేషకులను ఆదేశించినట్లు గ్రుష్ తెలిపారు.ప్రయోగంలో భాగంగా భారత్ తన ఉపగ్రహం 'మైక్రోశాట్-ఆర్' ను నింగిలోనే విజయవంతంగా కూల్చివేసింది. దీంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను ధ్వంసం చేసే వ్యూహాత్మక సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరింది. ఈ ప్రయోగం తక్కువ భూకక్ష్యలో జరిగిందని, ఏర్పడిన వ్యర్థాలు కొన్ని వారాల్లోనే నశిస్తాయని, అంతరిక్షంలో ఆయుధాల పోటీలో పాల్గొనే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశాంగ శాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది.భారత్ క్షిపణి ప్రయోగంపై నిఘా పెట్టేందుకు డియెగో గార్సియా బేస్ నుంచి అమెరికా వైమానిక దళ విమానం బంగాళాఖాతం మీదుగా వచ్చిందని 'ఎయిర్‌క్రాఫ్ట్ స్పాట్స్' నివేదించింది. అయితే తమ ఆస్తులేవీ భారత్‌పై గూఢచర్యం చేయలేదని అమెరికా రక్షణ శాఖ అప్పట్లో ప్రకటించినప్పటికీ.. గ్రుష్ చెప్పిన విషయాలను బట్టి ఈ ప్రయోగం అమెరికాకు పూర్తిగా ఊహించని షాక్ అని స్పష్టం చేస్తున్నాయి.

## ఆనంద నిలయం.. ఆదిశక్తి ఆలయం

భారతదేశంలో అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లు ఒకే దగ్గర కొలువైన క్షేత్రం ఆనందాశ్రమం. సిద్దిపేట జిల్లా కొండపాక సమీపంలో ఉన్న ఈ ఆనంద నిలయంలో ఎందరో వృద్ధులు విశేష జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. అలాంటి ప్రాంగణం ఇప్పుడు ఆధ్యాత్మిక క్షేత్రమై అలరారుతున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాలలో భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న అమ్మవార్లు ఇక్కడ కొలువుదీరారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిలో కొండపాకలో ఉన్న ఈ సువిశాలమైన ప్రాంగణం ఇప్పుడు ఓ ఆధ్యాత్మిక కేంద్రం.శక్తిపీఠాలు పద్దెనిమిది. వీటిలో పదిహేడు మనదేశంలో ఉండగా శాంకరీదేవి శ్రీలంకలోని ట్రింకోమలిలో ఉంది. కామాక్షి (కంచి), శృంఖల (కోల్‌కతా), చాముండేశ్వరి (మైసూరు), జోగులాంబ (అలంపూర్), భ్రమరాంబ (శ్రీశైలం), మహాలక్ష్మి (కొల్హాపూర్), ఏకవీర (మాహుర్), మహాకాళి (ఉజ్జయిని), పురుహూతిక (పిఠాపురం), గిరిజ (జాజ్‌పూర్), మాణిక్యాంబ (ద్రాక్షారామం), కామరూపిక (కామాఖ్య), మాధవేశ్వరి (ప్రయాగ), వైష్ణవీదేవి (జమ్మూ), మంగళగౌరి (గయ), విశాలాక్షి (కాశి), సరస్వతీ దేవి (శ్రీనగర్) రూపాలను ఆనంద నిలయంలో దర్శించుకోవచ్చు. ఇదే ప్రాంగణంలో లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివపార్వతులతో కూడిన 22 దేవాలయాలను నిర్మించడం విశేషం.

ఆధ్యాత్మిక శోభ సామాజిక సేవ...

కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారికి ఆనుకుని కొండపాక గ్రామ శివారులో ఆనంద నిలయం ఆవరణలో ఈ క్షేత్రం ఉంది. శక్తిపీఠాల ఆలయానికి కుడిపైపున శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం కొలువైంది. అమ్మవారి మందిరానికి ఎదురుగా అరుదైన గోవులతో ఓ గోశాలనూ నిర్వహిస్తున్నారు. ఇది పిరమిడ్ ఆకృతిలో ఉండటం విశేషం. మరోపక్క ఆనంద్ నిషాంత్ బాలసదన్ చారిటబుల్ ట్రస్టు, ఆనంద నిలయం వృద్ధాశ్రమం ఉండటంతో ఆ ప్రాంతం భక్తులు, సామాజిక సేవకుల సందర్శనలతో సందడిగా ఉంటుంది. గోశాల ప్రాంగణంలో శ్రీరాధాకృష్ణసమేత గోమాత మందిరం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. సమీపంలోనే సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సల దవాఖాన నిర్మాణం జరుగుతున్నది.



ఆధ్యాత్మికం

# రామగుండం ఎరువుల కర్మాగారంతో ప్రాంతానికి మరింత ప్రయోజనం కలగాలి

● ప్రజలు, రైతులు, యువత ప్రయోజనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న మాజీ ఎమ్మెల్యే

**గోదావరిఖని ప్రతినిధి :** రామగుండంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కు సంబంధించి మాజీ ఎమ్మెల్యే చందర్ కీలక అంశాలను ప్రస్తావించారు. సంస్థ ప్రాధాన్యతతో పాటు స్థానిక ప్రాంతానికి, ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆర్ ఎఫ్ సి ఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రామగుండం ప్రాంతంలో ఉండటం వల్ల పారిశ్రామికంగా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత పెరిగిందని చందర్ పేర్కొన్నారు. అయితే సంస్థ కార్యకలాపాల ద్వారా స్థానిక ప్రజలు, రైతులు, నిరుద్యోగ యువతకు మరింత ప్రయోజనం చేకూరేలా చర్యలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల లభ్యత, స్థానికంగా ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాల్లో ఆర్ ఎఫ్ సి ఎల్ పాత్రపై మరింత దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. సంస్థకు సంబంధించిన అంశాలపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఆర్ ఎఫ్ సి ఎల్ కు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని సంస్థ అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని చందర్ కోరారు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరేలా సంస్థ కార్యకలాపాలు కొనసాగాలని, ప్రాంతీయ అభివృద్ధికి ఆర్ ఎఫ్ సి ఎల్ మరింతగా దోహదపడాలని మాజీ ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు.

# దళిత మహిళ మాధవిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

● నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి

● దళితులు, గిరిజనులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి: కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను

**నల్గొండ ప్రతినిధి అక్టోబర్ 03 :** నల్గొండ జిల్లాలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, కుల వివక్ష, అవమానాలు, దూషణలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. శనివారం హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చింతపల్లి మండలం పి.కె. మల్లెపల్లి గ్రామంలో గ్రామ సభ సందర్భంగా దళిత మహిళ వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. **గ్రామ సభలో మహిళపై దాడి దురదృష్టకరం** గ్రామ సభ అనేది ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసే ప్రజాస్వామ్య వేదిక అని కొండేటి శ్రీను అన్నారు. అలాంటి గ్రామ సభలోనే ఒక దళిత మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడటం తీవ్రంగా ఆందోళన కలిగించే విషయమన్నారు. గనిపల్లి మాధవిపై దాడికి సంబంధించిన వీడియో కూడా వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల సమక్షంలో ఒక మహిళను అవమానించడం, ఆమెపై దాడికి పాల్పడటం వంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కులపరమైన దూషణలకు చట్టపరమైన చర్యలు తప్పనిసరి. దళిత మహిళపై కులపరమైన దూషణలు, అవమానాలు లేదా దాడి జరిగితే ఘటన యొక్క పూర్తి వాస్తవాలను విచారించి, వర్తించే చట్టాల ప్రకారం కేసు నమోదు చేయాలని కొండేటి శ్రీను కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు జరిగిన సందర్భాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంలోని వర్తించే నిబంధనలను పరిగణనలోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేయడంతో మాత్రమే బాధ్యత ముగియదని, దర్యాప్తును నిష్పక్షపాతంగా నిర్వహించి బాధితురాలికి చట్టపరమైన రక్షణ, అవసరమైన సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధితురాలికి రక్షణ కల్పించాలి. దాడికి గురైన గనిపల్లి మాధవికి తక్షణ రక్షణ కల్పించాలని, ఆమెకు ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురుకాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి, ఘటనకు సంబంధించిన వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా జిల్లా స్థాయి అధికారులు కూడా ఈ ఘటనను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు. దళితులు, గిరిజనులపై దాడులను అరికట్టాలి. నల్గొండ జిల్లాలో దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న కుల వివక్ష, సామాజిక అవమానాలు, దాడులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కొండేటి శ్రీను అన్నారు. ఏ గ్రామంలోనైనా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలపై దాడులు లేదా వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నాయని, కులం పేరుతో ఎవరినైనా అవమానించడం లేదా అణగదొక్కే ప్రయత్నం చేయడం సమాజానికి హానికరమన్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. నల్గొండ జిల్లా ఎస్పీ ఈ ఘటనపై ప్రత్యేకంగా దృష్టి సారించి, బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కొండేటి శ్రీను కోరారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామ సభల్లో ప్రశాంత వాతావరణం అవసరం గ్రామ సభలు ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన సమావేశాలని, అక్కడ ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఉండాలని అన్నారు. గ్రామ సభలలో వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పరస్పరం గౌరవించుకుంటూ సమస్యలను చర్చించుకోవాలని, మహిళలు, దళితులు, గిరిజనులు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించే వాతావరణం ఉండాలని అన్నారు. కుల వివక్ష నిర్మూలనకు సామాజిక చైతన్యం అవసరం కేవలం చట్టాలతోనే కుల వివక్ష పూర్తిగా నిర్మూలించలేమని, సమాజంలో కూడా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని కొండేటి శ్రీను అన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలపై వివక్ష చూపే ఆలోచనా విధానాన్ని మార్చేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. బాధితులకు అండగా కెవిపిఎస్ దళితులు, గిరిజనులపై ఎక్కడ అన్యాయం జరిగినా కెవిపిఎస్ వారి పక్షాన నిలబడి చట్టపరమైన న్యాయం కోసం పోరాడుతుందని కొండేటి శ్రీను స్పష్టం చేశారు. బాధితులు భయపడకుండా తమపై జరుగుతున్న అన్యాయాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కులం, మతం, వర్గం పేరుతో ఎవరినీ అవమానించకుండా సమానత్వ భావనతో వ్యవహరించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళిత మహిళ గనిపల్లి మాధవిపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టాలని కొండేటి శ్రీను మరోసారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి నరేష్, కొండేటి చింటూ, కొండేటి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి ప్రదాత కేసీఆర్: రామగుండంలో ఘనంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- 16.78 లక్షల పేద కుటుంబాలకు వెలుగులు నింపిన మహానాయకుడు కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ -

ప్రస్తుత ప్రభుత్వంలో కళ్యాణలక్ష్మి అమలుపై తీవ్ర ఆందోళన



**గోదావరిఖని ప్రతినిధి** తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసానిచ్చి 'కళ్యాణలక్ష్మి' పథకం ద్వారా వెలుగులు నింపిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ సారథి కే. చంద్రశేఖర్ రావుకే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. శనివారం రామగుండం నియోజకవర్గంలో మహిళలు, బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి నిర్వహించిన పాలాభిషేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఒకప్పుడు లంబడీ తండాలతో పాటు పేద కుటుంబాల్లో ఆడపిల్ల పుడితేనే పెళ్లి భారం ఎలా మోయాలని భయపడే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. పేదల ఆకలి చావులు, ఆత్మహత్యలు లేని తెలంగాణను చూడాలని, ప్రతి పేదింటికీ సంక్షేమ ఫలాలు అందాలనే మానవీయ కోణంలో ఆలోచించి కేసీఆర్ 'కళ్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' వంటి అద్భుత పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. 16.78 లక్షల కుటుంబాలకు లబ్ధి. గడిచిన పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16 లక్షల 78 వేల పేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి ద్వారా నేరుగా ఆర్థిక సాయం అందిందని తెలిపారు. ఆ పదేళ్ల కాలంలో ఏ పేదవాడికీ తమ ఇంట్లో ఆడపిల్ల పెళ్లి భారం కాలేదని, ఎంతో సంతోషంగా పెళ్లిళ్లు జరిపించుకున్నారని పేర్కొన్నారు. ?ప్రస్తుత ప్రభుత్వంలో నిలిచిన ఆర్థిక సాయం అయితే, ప్రస్తుత పాలనలో గత రెండున్నరేళ్లుగా కళ్యాణలక్ష్మి పథకం అమలు కాక పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చందర్ ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు రావాల్సిన హక్కుల కోసం కోర్టు తలుపులు తడిట్టినా ప్రభుత్వం తరపున వాదనలు వినిపించే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కళ్యాణలక్ష్మి పథక ప్రదాత కేసీఆర్ కు కృతజ్ఞతగా రామగుండం నియోజకవర్గ మహిళా లోకమంతా ఏకమై కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ మార్కు సంక్షేమ పాలన రావాలని నియోజకవర్గ పేద ప్రజలు, మహిళలు బలంగా కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, భారీ సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మపురిలో గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్

**ధర్మపురి, అక్టోబర్ 3, :** ధర్మపురి పట్టణంలో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపడుతున్న ఘాట్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పారిశుధ్య ఏర్పాట్లు, పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. తదుపరి ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. డయాలసిస్ సేవలు, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, రోగుల జాబితా, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ధర్మపురి తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా పిఆర్టియుటిఎస్‌లో కొత్త నాయకత్వం

అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్ ఎన్నిక

నాలుగు ప్యానెళ్ల మధ్య హోరాహోరీ పోరు - ప్రత్యర్థులపై స్పష్టమైన ఆధిక్యంతో విజయం

**గోదావరిఖని ప్రతినిధి:** పిఆర్టియుటిఎస్ పెద్దపల్లి జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గండు కృష్ణమూర్తి, కానుగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం రంగంపల్లిలోని ఆర్.ఆర్. గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొత్తం నాలుగు ప్యానెళ్లు ఎన్నికల బరిలో నిలవగా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటీ తీవ్రంగా సాగింది. అధ్యక్ష పదవికి పోటీ చేసిన గండు కృష్ణమూర్తికి 55 ఓట్లు రాగా, రాచర్ల శ్రీనివాస్‌కు 34, మెతుకు తిరుపతికి 23, ఆకుల రాజన్నకు 10 ఓట్లు లభించాయి. దీంతో సమీప ప్రత్యర్థి రాచర్ల శ్రీనివాస్‌పై 21 ఓట్ల ఆధిక్యంతో గండు కృష్ణమూర్తి విజయం సాధించారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి కానుగంటి శ్రీనివాస్‌కు 49 ఓట్లు రాగా, నాంపల్లి రాజకుమార్‌కు 32, మునిగాల హరికృష్ణకు 26, దాసరి రఘుకు 12 ఓట్లు లభించాయి. దీంతో నాంపల్లి రాజకుమార్‌పై 17 ఓట్ల ఆధిక్యంతో కానుగంటి శ్రీనివాస్ విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు 20 మంది జిల్లా కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ ఎన్నికల పరిశీలకులుగా జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, ఆనంద్ రావు వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్

సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన కమిషనర్

ఆర్టీఐ ఫిర్యాదు అప్పీల్ పై సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో విచారణలో పాల్గొన్న మద్దెల దినేష్

**గోదావరిఖని ప్రతినిధి** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ నిర్మాణాలు, అక్రమ నిర్మాణాల సమాచారాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) కింద ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ దాఖలు చేసిన అప్పీల్‌పై నేడు శనివారం రోజున తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కార్యాలయం లో విచారణ జరిగింది. ఈ విచారణకు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ హాజరై తన వాదనలు వినిపించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఇవ్వకుండా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నిర్లక్ష్య ధోరణి వహిస్తూ, నియంతృత్వంగ వ్యవహరిస్తుందని, అడిగిన సమాచారన్ని అందించడంలో ఎందుకు జంకుతున్నారో అర్థం కాని పరిస్థితి అని అడిగిన సమాచారాన్ని అందించకపోవడం పై విచారణ సందర్భంగా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు మద్దెల దినేష్ తెలిపారు. సమాచారం హక్కు చట్టం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు కల్పించిన హక్కు అని, ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టప్రకారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు దాచిపెట్టకుండా పారదర్శకంగా అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 25న సమాచారాన్ని కోరితే 30రోజుల్లో సమాచారం ఇవ్వాలని తిలియదా అని వారు అధికారులను నీలాదీశారు. అదే విధంగా ఇట్టి సమాచారాన్ని మెదటి అప్పిల్ దరఖాస్తు పెట్టినప్పటికి కూడ స్పదించలేకపోయారని దీనికి అయిన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసారని, మీకు భారీగా ఫైన్లు తప్పవని మరొక 15రోజులు గడువు ఇస్తున్నాని, అయినప్పటికీ సమాచారం ఫిర్యాదు దారుడికి అందించకపోతే కార్పొరేషన్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు షోకాజ్ నోటీస్ లు జారి చేస్తామని కమిషన్ హెచ్చరించిందని దినేష్ పేర్కొన్నారు.

## బక్కని రవి మాదిగ ఇకనుండి ఎమ్మార్పీఎస్ పేరు వాడితే సహించేది లేదు

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం

స్పష్టం చేసిన రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి రావుగళ్ళ బాబు

**మహేశ్వరం, అక్టోబరు, 03, :** ఇకనుండి బక్కని రవి మాదిగ ఎమ్మార్పీఎస్ పేరు వాడితే సహించే ప్రసక్తే లేదని రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి రావు గల బాబు హెచ్చరించారు. శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో మహేశ్వరం మండల ఎంఆర్పిఎస్ ఇన్చార్జి ఎర్ర గణేష్ మాదిగ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకనుండి ఎమ్మార్పీఎస్ సంఘానికి బక్కని రవి మాదిగకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈనెల 2వ తేదీన స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడానికి సిద్ధమైన అతనికి ఎమ్మార్పీఎస్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బక్కని రవి మాదిగ ప్రమేయం లేకుండా కల్వకోలు గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్న అతని తల్లి బక్కని లక్ష్మమ్మ బీఆర్ఎస్ పార్టీలోకి ఎలా వెళ్లగలుగుతుందని ఆయన ప్రశ్నించారు. 32 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేశామన్నారు. బక్కని రవి మాదిగ వ్యక్తిగత స్వేచ్ఛకు ఎమ్మార్పీఎస్ సంస్థ ఎలాంటి ఆటంకాలు సృష్టిందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని సమాచారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతోనే ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకే బక్కని రవి మాదిగను ఎమ్మార్పీఎస్ సంఘం నుండి బహిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల ఎంఆర్పిఎస్ ఇంచార్జి ఏర్పుల గణేష్ , మండల అధ్యక్షుడు బొల్లేపాక ప్రభాకర్ మాజి మండల అధ్యక్షుడు ఎర్ర క్రిష్ణ, డాక్టర్ జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి, అక్టోబర్ 3,:** ధర్మపురి పట్టణ వాస్తవ్యులు, ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త మరియు వేద జ్యోతిష నిపుణులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి మాతృమూర్తి ఇటీవలే పరమపదించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం సంతోష్ కుమార్ శాస్త్రి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● త్వరితగతిన పెద్దపల్లి బస్ డిపో పనులు పూర్తి చేయాలి ● ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి ● కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలి ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను, రాఘవపూర్ గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి భవనాన్ని, పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. **బైపాస్ రోడ్డు పనులను వేగవంతం చేయాలి:** పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచి, పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. **ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి:** రాఘవపూర్ గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులు పూర్తయినందున ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భవనానికి సంబంధించిన అప్రోచ్ రోడ్డును పరిశీలించి, అవసరమైన మరమ్మతు పనులను చేపట్టి రాకపోకలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. **త్వరతిగతిన బస్ డిపో పనులు పూర్తి చేయాలి:** పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బస్ డిపోలో ప్రయాణికులు, సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో బస్ డిపో నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. **కూనారం రైల్వే ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలి:** కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ వైరింగ్, విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. **అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలి:** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెండింగ్ పనులను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య, డీఈ రమణారెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, ఈఈ పీఆర్ శంకరయ్య, గోదావరిఖని డిపో మేనేజర్ కవిత, రైల్వే జేఈ జానకిరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ భవ్ సింగ్, తహసీల్దార్ రాజయ్య,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవను బాధ్యతగా భావించాలి

● అర్జీ త్రీ ,ఏఎల్పి జనరల్ మేనేజర్లు మధుసూదన్ నాగేశ్వరరావు ● నెలకు రూ,,100 కార్మికులకు అండ అభినందనీయం ● నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ ● సింగరేణి కమ్యూనిటీ హాల్ లో మెగా రక్తదాన శిబిరం ప్రారంభించిన జిఎంలు ● కార్మికులు విధులతోపాటు సామాజిక బాధ్యతలు నిర్వహించడం గొప్ప విషయం ● మంచి పనులన్నింటికీ మా ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుంది ● పెద్ద సంఖ్యలో రక్తదానం చేసిన యువ కార్మికులు

**రామగిరి, అక్టోబర్ 03:-** సేవే మా గుణం- ఐక్యతే మాకు ఆభరణం అనే నినాదంతో నెలకు రూ,,100 -ఆపదలో అండ రామగుండం రీజియన్ లో సింగరేణి యువ కార్మికులు చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని ఇతర కార్మిక వర్గం మరియు ఇతరులు బాధ్యత గా భావించి ముందుకు సాగాలని ఆర్జీ 3 మరియు ఏపీఏ ఏరియా జనరల్ మేనేజర్లు సుంకర మధుసూదన్, కొలిపాక నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్లో సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ఐఈడి డిజిఎం మురళీకృష్ణ, ఏజీఎం బండి సత్యనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సేవ చైతన్య కార్యక్రమాలు ఆదర్శవంతం సింగరేణి యువబలగం సభ్యులు మూడు సంవత్సరాల కాలంలో సింగరేణి తమ వంతు బాధ్యతగా సమాజంలోని పేదలు, నిరుపేద కుటుంబాలు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ 130 పేద కుటుంబాలకు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి లేదా ఇతర కారణాలవల్ల ఆసుపత్రుల్లో ఉండి కనీసం బిల్లులు చెల్లించలేని కడు నిరుపేదలలో పలువురికి వారి అవసరాన్ని బట్టి ధనరూపంలోనూ, వస్తురూపంలోనూ సహాయం చేయడం ఇతరులకు ఆదర్శమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో చేయూతగా మొక్కలు నాటడం మరియు ఖాళీ ప్రదేశాలలో సీడ్ బాల్స్ వేయడం లాంటివి నిర్వహిస్తూ బ్లడ్ డోనర్స్ గ్రూపులో సభ్యుల మరియు బ్లడ్ గ్రూప్ వివరాలు పొందుపరిచి రక్తం అవసరమైన వారికి అందేలా చేయడం సేవా గుణాన్ని పెంపొందిస్తుందన్నారు. నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ ఓ సి వన్ లో ఈ పి ఆపరేటర్ గా పనిచేసే అనారోగ్యంతో మరణించిన నరసింహుల వీరారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ముగ్గురు నిరుపేద కుటుంబాల వారికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులను సమకూర్చగా జిఎంలు మధుసూదన్ మరియు నాగేశ్వరరావు టీబీజీకే అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మిగిలిన అధికారులు, నాయకులతో కలిసి ముగ్గురు నిరుపేదలైన మహిళలకు నిత్యవసర సరుకులు అందజేశారు. నిరుపేదలను ఆదుకోవడం చాలా గొప్ప విషయమని ఇలాంటిది తోచిన విధంగా ప్రతి ఒక్కరు చేయూతని అందించేలా చూడాలని పేర్కొంటూ తమ వంతు బాధ్యతగా రానున్న రోజుల్లో నిర్వహించే కార్యక్రమంలో నిరుపేదలను ఆదుకునేందుకు ఇట్టి కార్యక్రమం ద్వారా చేయూతనందిస్తామని సభ్యులకు తెలియజేశారు. మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిఎంలు తల సేమియా వ్యాధిగ్రస్తులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో కిడ్నీ సమస్యలతో బాధపడి డయాలసిస్ స్థితిలో ఉన్న రోగులను ఆదుకునేందుకు అవసరమైన రక్తాన్ని సేకరించే సదుద్దేశంతో సింగరేణి యువబలగం వారు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువ బలగం సభ్యులు ఇతరులు 150 మందికి పైగా విచ్చేసి రక్తదానాన్ని చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ చక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడం మరొకరికి ఆరోగ్య ప్రదానం చేయడమేనని దీంతోపాటు రక్తనిచ్చేవారు సైతం ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకునే వారు అవుతారని పేర్కొన్నారు. రక్త కణాలు సైతం పునరుత్పత్తి జరిగి కొంత ఇన్ఫెక్షన్లకు విముక్తి కలిగే అవకాశం ఉంటుందని మూడు నెలల్లోనే మానవ శరీరంలో రక్తం ఎప్పటి మాదిరిగా తయారవుతుందని వివరించారు. యువత పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ సేవా ప్రస్థానంలో ఒక్కరు లేదా ఇద్దరి కృషి మాత్రమే కాకుండా, సింగరేణి యువ బలగం సభ్యులందరి సహకారం, ఆదరణ, అభిమానం, ఐక్యతతోనే ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఇదే స్ఫూర్తిని ఐక్యతను కొనసాగించాలని సూచించారు. సింగరేణి పరంగా మరి అధికారులుగా నాయకులుగా పూర్తి సహాయ సహకారాలు సింగరేణి యువబలగానికి అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్ సి రెడ్డి, ఐఎన్టీయూసీ నాయకులు రామారావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి,సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శఫ్రుద్దీన్,ఏఎస్ఐ స్వామి, తదితరులతో పాటు సింగరేణి యువ బలగం పాశం శ్రీనివాస్ రెడ్డి ,వీరగోని సంతోష్ గౌడ్ ,బోయినపల్లి శ్రీకాంత్ రావు ,బుడిగే క్రాంతి కుమార్, మాదారపు కేశవ రావు ,గుజ్జుల రాజశేఖర్ రెడ్డి, మల్లోరి నికేష్ రెడ్డి, గాండ్ల సతీష్ ,గండి శ్రీనివాస్, మంద సురేష్, వంశీనాథ్ ,జగన్నాథం రవి, వేముల శ్రీకాంత్, పూజారి కిరణ్ ,వాసాల రామాంజనేయులు, బీరం సంజీవ్, అనవేని సంజీవ్, అట్టే బాబు జోసెఫ్, వేగోళం శ్రీనివాస్, పరిషవేణి సమ్మయ్య,మహేష్, సందీశ్రీనివాస్ రెడ్డి,రవి,సూర్య ప్రకాష్,కట్ల సంతోష్,మేకల రమేష్, రాకేష్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్ డాక్టర్ ప్రేమ్ సాయి సూపర్ వైజర్ మాధవి సిబ్బంది రవి వర్మ రజిత రాజేష్ హరీష్ తదితరులు ఉన్నారు.

## రిజర్వ్ ఫారెస్ట్ లో అక్రమ మట్టి తవ్వకాలు

### విజిలెన్స్ కు పుట్ట ముకేష్ ఫిర్యాదు

**రామగిరి, అక్టోబర్ 03:-** రామగిరి మండలం ఆదివారంపేట గ్రామ సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు, చెట్ల నరికివేత జరుగుతోందంటూ మంథనికి చెందిన పుట్ట ముకేష్ తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారంపేట రిజర్వ్ ఫారెస్ట్ లో మెఘా ఇంజనీరింగ్ సంస్థ సంబంధిత అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరిపి, చెట్లను తొలగించి తరలిస్తోందని, సింగరేణి ఓసీ-టూ , ఓసీ-త్రీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఓబీ మట్టిని తరలిస్తున్నారని, ఈడీ మైన్స్ అండ్ జియాలజీ, పెద్దపల్లి అధికారుల సహకారంతో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణ, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సింగరేణి బ్లాస్టింగ్ ద్వారా తొలగించిన, బొగ్గు కలిసిన నాసిరకం మట్టి (గ్రావెల్) ను రోడ్డు నిర్మాణం, స్ట్రెంతెనింగ్ పనులకు వాడుతున్నారని, ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక సబ్ కాంట్రాక్టర్ ను నియమించి, అనుభవం లేని వారితో పనులు చేయిస్తూ నాణ్యతా ప్రమాణాలు, టెండర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇంజనీరింగ్, మైనింగ్, అటవీ శాఖ అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని, అక్రమంగా తరలించిన మట్టి, తొలగించిన చెట్లకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, బాధ్యులైన సంస్థలు, అధికారులు, కాంట్రాక్టర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

## మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల గడువు పొడిగింపు

### జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్

**పెద్దపల్లి ప్రతినిధి :** మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం 2026 ఆగస్టు/సెప్టెంబర్ దశకు సంబంధించిన దరఖాస్తుల సమర్పణ గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30తో ముగియాల్సిన దరఖాస్తుల గడువును అక్టోబర్ 15, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. విదేశాల్లో మాస్టర్స్, డాక్టరల్ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హత కలిగిన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరులు కలిపి రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలని, దరఖాస్తు సమయంలో అభ్యర్థి వయస్సు 35 సంవత్సరాలు దాటకూడదని తెలిపారు. డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా 260 మార్కులు లేదా 500 మార్కులు, వీటిలో ఏదో ఒక పరీక్షలో నిర్దేశిత మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. ూజుఖీలో 60 మార్కులు లేదా 6.0 బ్యాండ్ లేదా ూజులో 50 మార్కులు, వీటిలో ఏదో ఒక పరీక్షలో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రిజిస్ట్రేషన్, దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి, అక్టోబర్ 3, (:** ధర్మపురి పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ బండారి అశోక్ బావ కాశెట్టి శ్రీనివాస్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందడంతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎంతో విచారకరం వ్యక్తం చేశారు. మృతి విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మృతుని స్వగృహానికి చేరుకుని, ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పట్టణంలోని గంపల వాడ కు చెందిన దుంపటి కలవ్వ ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల తో పాటు పలువురు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి సతీష్ కుమార్

**పెద్దపల్లి ప్రతినిధి :** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి సతీష్ కుమార్ అన్నారు. శనివారం పెద్దపల్లి డి ఎఫ్ ఓ ఆదేశాల మేరకు పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి రేంజ్, మంథని రేంజ్ సిబ్బంది పెద్దపల్లి పోలీస్ తో కలిసి సంయుక్తంగా పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో కార్డాన్ సెర్చ్, రైడ్ నిర్వహించి వేటకు ఉపయోగించు వలలు క్లచ్ వైర్లు జాలీలు ఉచ్చులు కత్తులు ఇనుప కేజులు నైలాన్ తాళ్ళు, బైండింగ్ వైర్ లు సీజ్ చేశారు ఈ సందర్భంగా గ్రామస్తులతో వన్యప్రాణి వారోత్సవాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అడవులను నరకడం, వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, అటవీ సంపదను కాపాడడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎవరైనా అక్రమంగా అడవిలో వన్యప్రాణులను వేటాడితే వేటాడిన వారిపై ఉక్కు పాదం మోపుతామని ఎఫ్ఆర్ఓ సతీష్ కుమార్ హెచ్చరించారు. అనంతరం బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎఫ్ ఆర్ ఓ టి. సతీష్ కుమార్ తో పాటు ఎం వినయ్ నాయక్ అటవీ క్షేత్ర అధికారి, మంథని డిప్యూటీ రేంజ్ అధికారులు పి దేవదాస్, ఎస్ రమేష్, జే తిరుపతి, జి కొమురయ్య, సెక్షన్ అధికారులు ఎస్డి రహమతుల్లా,ఎం నరసయ్య, హెచ్ మంగీలాల్ , ఎండి అమిరుద్దీన్,రవి, ముదస్సర్ షా, బీట్ అధికారులు జి.రామ్మూర్తి ఎస్ మెగరాజ్, పవన్ ప్రదీప్ తిరుపతి మాధురి రంజిత శ్రీకాంత్ అక్తర్ పాషా రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం...

### కిరాయి దారులకు అద్దె షాటర్స్ ఇచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లో గతంలో షాపర్లను కిరాయికి తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి షాపర్లను రిజిస్ట్రేషన్ చేసి అందించేందుకు చర్యలు తీసుకున్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె సదానందం మాట్లాడుతూ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లో షాపర్లను గతంలో కిరాయికి తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా షాపర్లకు సంబంధించిన సమస్యను ఎదుర్కొంటున్న వారికి కలెక్టర్ తీసుకున్న చర్యలతో ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. షాపర్ల విషయంలో తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు పల్లె సదానందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, తమ కృతజ్ఞతను వ్యక్తం చేశారు. అలాగే ఈ సమస్యను ప్రజల దృష్టికి తీసుకురావడంలో సంబంధిత విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సహకరించిన పత్రికా మిత్రులకు పల్లె సదానందం కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్న మీడియా ప్రతినిధుల సేవలను ఆయన అభినందించారు. గతంలో షాపర్లను కిరాయికి తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం ద్వారా వారి హక్కులకు భరోసా కల్పించిన జిల్లా కలెక్టర్‌కు షాపర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ఇదే విధంగా స్పందించాలని పల్లె సదానందం కోరారు. ఈ కార్యక్రమంలో మోర మనోహర్, బండ కరుణాకర్, పెండ్యాల కుమార్, తాళ్ల లక్ష్మణ్, శానగొండ సంపత్ కుమార్, వెంకటేష్, కొండ్రా మనోహర్, అబిలాష్, ఫరూక్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో 'చైతన్య జ్యోతి' పెట్రోల్ పంపు ప్రారంభం

● మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ● రూ.1.15 కోట్లతో మహిళా సంఘాల పెట్రోల్ బంక్.. ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్ ● స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణం రూ.10 లక్షలకు పెంపు.. పెద్దపల్లిలో మహిళల ఘన విజయం ● మహిళలకు అండగా బీమా భరోసా: సుల్తానాబాద్‌లో ఘనంగా పెట్రోల్ పంపు ప్రారంభోత్సవం ● డిగ్రీ, పీజీ మహిళలకు జిల్లాలోనే 'వర్క్‌ఫ్రమ్‌హోమ్' ఉద్యోగాలు: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**సుల్తానాబాద్, అక్టోబర్ 03 :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వావలంబన దిశగా తీసుకెళ్లడంతో పాటు వారిని కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ వద్ద స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో రూ.1.15 కోట్లతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపును జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో పాటు టిఫిన్ సెంటర్లు, చిన్న దుకాణాలు, స్కూల్ యూనిఫామ్ కుట్టు కేంద్రాలు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మహిళల ఆధ్వర్యంలో ఇప్పటికే 7 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. స్వశక్తి సంఘాల మహిళలకు గతంలో రూ.5 లక్షల వరకు ఉన్న వడ్డీలేని రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,715 స్వశక్తి సంఘాలకు రూ.33.42 కోట్ల మేర రుణాలు అందించినట్లు వివరించారు. మహిళలకు బీమా భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్న ఆయన, సహజ మరణానికి రూ.2 లక్షల రుణ బీమా, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 99 మంది మహిళల కుటుంబాలకు రూ.75 లక్షల రుణ బీమా, ఆరుగురు ప్రమాద బాధిత మహిళల కుటుంబాలకు రూ.60 లక్షల ప్రమాద బీమా ప్రయోజనం అందించినట్లు చెప్పారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆయిల్‌పామ్, కూరగాయలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని

విజయరమణారావు సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు పెట్రోల్ పంపులు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. టాస్క్ ద్వారా గత మూడేళ్లలో సుమారు 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించగా, వారిలో సుమారు 60 శాతం మంది మహిళలేనని వివరించారు. డిగ్రీ, పీజీ చదివిన మహిళలను గుర్తించి రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగం చేయలేని మహిళలకు జిల్లాలోనే వర్క్‌ఫ్రమ్‌హోమ్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒంటరి మహిళలకు ఆయిల్‌పామ్ సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని, మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుండగా మిగిలిన 10 శాతం వాటాను కూడా జిల్లా యంత్రాంగం భరించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**- 50కిపైగా కేసులు నమోదు.. కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ నరేందర్‌రావు**

**మేడ్చల్, అక్టోబర్ 03:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ సి.హెచ్. నరేందర్‌రావు హెచ్చరించారు. రోడ్డు భద్రత దృష్ట్యా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ, చక్రీపురం, ఈసీఐఎల్ చౌరస్తా, రాధిక చౌరస్తా, కుషాయిగూడ మార్కెట్, బస్టాప్, రాధిక--దమ్మాయిగూడ ప్రధాన రహదారి, ఏఎస్‌రావునగర్ ప్రధానరహదారుల్లో వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా ప్రయాణించాలని కోరారు. రహదారుల వెంట ఉన్న షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, బార్లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు తదితర వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాలను రహదారులపై నిలిపివేయకుండా ఆయా ప్రాంగణాల్లోని పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని సీఐ సూచించారు. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 50కిపైగా కేసులు నమోదు: కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ నరేందర్‌రావు, ఎస్ఐ మధు ఆధ్వర్యంలో రాధిక చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణించడం, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలపడం తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి 50కిపైగా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్లను గమనిస్తూ, రహదారిపై సూచించిన వేగ పరిమితులను పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ఒక్కరి నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని సీఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సీఐ నరేందర్‌రావు అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడిపి విలువైన ప్రాణాలను కోల్పోవద్దని సూచించారు. వాహనదారుల కోసం వారి కుటుంబ సభ్యులు ఇంటి వద్ద ఎదురుచూస్తుంటారని, ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబాన్ని విషాదంలోకి నెట్టవచ్చని పేర్కొన్నారు. తమ ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా

వ్యవహరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇకపై కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ నరేందర్‌రావు స్పష్టం చేశారు.

# మరణంలోనూ.. వెలుగు పంచారు!

**- గోపాల లక్ష్మి నేత్రదానం ..మరో ఇద్దరికి చూపు - విషాదంలోనూ కుటుంబం మానవీయ నిర్ణయం**

**రామగిరి,అక్టోబర్03:**-ఆ ఇంట్లో కన్నీళ్లు ఆగలేదు.. అప్తురాలి మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అయినా అదే సమయంలో తీసుకున్న ఓ నిర్ణయం.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపనుంది. 'ఆమెఇక మన మధ్య లేకపోయినా.. ఆమె కళ్లతో ఇంకొందరు ప్రపంచాన్ని చూడాలి' అన్న ఆలోచనతో గోపాల లక్ష్మి కుటుంబం నేత్రదానానికి ముందుకొచ్చింది. పెద్దపల్లి జిల్లా కమన్పూర్ మండలకేంద్రానికి చెందిన గోపాల లక్ష్మి (80)మృతి చెందారు. కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో ఆమె దగ్గరిబంధువు లక్షెట్టి రాజలింగం సాధాశయ బాధ్యులు నేత్రదానం ప్రాధాన్యాన్ని వారికి వివరించారు. మరణించిన వ్యక్తి నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రాజలింగం, రాజమహేందర్ రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో వాసన్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్. చందు.నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. కన్నీళ్ల మధ్య.. కళ్లను దానం గోపాల లక్ష్మి కొడుకు శ్రీనివాస్ కోడలు సరస్వతి, కూతుర్లు-అల్లుండ్లు చింత కానీ పద్మ -రాజయ్య, పురేల్ల పుష్ప -లక్ష్మయ్య మరియు మనుమలు మనమరాలుకలిసి తీసుకున్న ఈ నిర్ణయం పలువురికి స్ఫూర్తిగా నిలిచింది. అప్తులనుకోల్పోయిన బాధలోనూ.. మరొకరి జీవితంలో వెలుగు నింపాలనే ఆలోచనకు ప్రాధాన్యమివ్వడం మానవత్వానికి ప్రతీకగా నిలిచింది. అభినందించిన సదాశయ ప్రతినిధులు గోపాల లక్ష్మి కుటుంబ సభ్యుల మానవీయ నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ సలహాదారులు నూక రమేష్,ప్రచార కార్యదర్శి కె ఎస్ వాసు, పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి,అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, కమన్ పూర్ బాధ్యులు కే నర్సింహా చారీ, కమన్పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణ రెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్, కోశాధికారి డా విజయ్ కుమార్,ప్రతినిధులు వెంకటస్వామి, జబ్బార్ఖాన్, కోలేటి మారుతీ తదితరులు అభినందించారు. ఒకరి మరణం.. ఇద్దరి జీవితాల్లో వెలుగు. గోపాల లక్ష్మి కుటుంబం చూపిన ఈ మానవీయత.. నేత్రదానం పట్ల సమాజంలో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. మనిషి ఈ లోకాన్ని విడిచివెళ్లినా.. తన చూపును మరొకరికి అందించి వారి జీవితంలో వెలుగుగా నిలవొచ్చనే సందేశాన్ని ఈ కుటుంబం చాటిచెప్పింది.

## సీనియర్ జర్నలిస్ట్ టీకే రమేష్ మృతి పట్ల ప్రభుత్వ విప్ విజయరమణారావు సంతాపం.. కుటుంబానికి పరామర్శ

**సుల్తానాబాద్, అక్టోబర్03 :** సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ టీకే రమేష్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన సుల్తానాబాద్‌లోని రమేష్ స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను నేరుగా పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి జర్నలిస్టుగా రమేష్ అందించిన సేవలను ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. కష్టకాలంలో ఉన్న రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం, పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుముల ప్రకాష్ రావు, పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక పత్రికా విలేకరులు తదితరులు పాల్గొని రమేష్‌కి నివాళులర్పించారు.

## అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్::** ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విద్యాశాఖ అధికారులను కోరారు. ఒక పాఠశాలకు మాత్రమే అనుమతి తీసుకుని, నాలుగైదు బ్రాంచీలను ఏర్పాటు చేసి 'గ్రామర్', 'టెక్నో', 'ఈ-టెక్నో', 'ఒలింపియాడ్' వంటి పేర్లతో అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఇలాంటి వ్యవహారాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై సమగ్ర తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన కోరారు.

## క్షేత్రపర్యటనలో భాగంగా ధర్మపరి ఆలయాన్ని సంధర్శించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**ధర్మపురి, అక్టోబర్ 3, :** క్షేత్రపర్యటనలో భాగంగా ధర్మపరి ఆలయాన్ని లక్షెట్టిపెట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. శనివారం లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా ధర్మపరి ఆలయాన్ని సంధర్శించారు. అనుభవ పూర్వక అభ్యాసంలో భాగంగా కార్యక్రమ కన్వీనర్ డా. తన్నీరు సురేష్ సారధ్యంలో విద్యార్థులు ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కాకతీయుల కాలం నాటి శ్రీరామలింగేశ్వర ఆలయం, బ్రహ్మపుష్కరిణి, సత్యవతీ ఆలయం ఇసుకస్థంభం కాలభైరవ ఆలయం, శ్రీ వేంకటేశ్వర ఆలయాలను సందర్శించి ఇక్కడి ఆధ్యాత్మిక చారిత్రక విశేషాలను తెలుసు కున్నారు. ధర్మపురి ఆలయ ఈ ఓ శ్రీనివాస్ మరియు ఆలయ సిబ్బంది, పూజారులు కలిసి విద్యార్థులకు ధర్మపురి వైభవాన్ని వివరించారు. చివరలో ధర్మపురిలో శ్రీ లక్ష్మి నరసింహ రైస్ మిల్ ని సందర్శించి రైస్ మిల్ వ్యాపార వేత్త గునిశెట్టి రవీందర్ నుండి వ్యాపార నిర్వహణపై మెళకువలు నేర్చుకున్నారు. బిజినెస్ రంగంలో నిలబడటానికి ఆధ్యాత్మిక వాతావరణానికి సమాజానికి గల సంబంధాలను ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. తన్నీరు సురేష్, కవిత, ప్రణవ్ లు పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

**స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 6.0 నిర్వహణ**

**రామగిరి, అక్టోబర్ 03 :-** కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ లోని అన్ని ఏరియాలలో అక్టోబర్ 02 నుండి 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 6.0 ను నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా అర్జీ త్రీ, ఎపిఎ జి.ఎం కార్యలయం నందు శనివారం నిర్వహించిన కార్యమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిజ్ఞ చేసి, కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్ర పరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ్రపరచ వలసిన కార్యాలయాలు, వాటి సుందరీకరణ, చెత్తను గుర్తించి పడవేయడం, సరియైన పద్దతులలో రికార్డులను బద్రపరచడం, తదితర అంశాల పై కార్యక్రమం నిర్వచించడం జరుగుతుందని, స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమములో అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 తేదీ వరకు అవసరమైన క్లీనింగ్ చేసి బద్రపర్చవలసిన పని స్థలాలను, ఆఫీస్ ఫైల్స్ గుర్తించడం, గుర్తించబడిన టార్గెట్ లను పూర్తి చేయడం, క్లీనింగ్ ముందు, తరువాత పోటోలను తీయడం వాటి రికార్డ్స్ బద్రపరచాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి బి.టి.మురళీకృష్ణ, ఎస్వోటుజిఎం బండి సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మీ నారాయణ, పర్యావరణ అధికారి ప్రశాంత్ జీవన్, విభాగధిపతులు ఎస్.రవి కుమార్, యండి.ఆసిఫ్ యాసిన్, ఆర్.రాజేశ్వరి, కె.శ్రీహర్ష, యండి.ఆసిఫ్, తో పాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఇచ్చిన మాట ఎటుపాయే....

**-మేడిపల్లి భూ నిర్వాసితులకు అందని పూర్తి నష్టపరిహారం**
**- అందని చుక్కగా ఇచ్చిన హామీలు - మా భూముల్లో మేం పంటలు వేసుకుంటాం : మేడిపల్లి రైతులు - మా విలువైన భూములు లాక్కొని మాకు అన్యాయం చేసిన మంత్రి -మేడిపల్లి రైతులు తీవ్ర ఆగ్రహం**

**రామగిరి, అక్టోబర్ 03:-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామం మేడిపల్లి శివారులో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కొరకు సుమారు 220 ఎకరాల భూమిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విషయం విధితమే. కానీ రైతులకు రావలసిన పూర్తి నష్టపరిహారాలు, డిమాండ్ల విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అందరి రైతులకు రావాల్సిన పూర్తి నష్టాలు పరిహారాలు ఇచ్చిన డిమాండ్లను రైతులకు అందించాలని లేనిపక్షంలో మా భూముల్లో మేమే పంటలు పండించుకుంటామని రైతులు హెచ్చరిస్తున్నారు. మూడు నెలల క్రితం కోకో కోల కంపెనీ ఏర్పాటులో భాగంగా స్థల పరిశీలనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారాలు, స్ట్రక్చర్స్ ఇంకా రావాల్సిన డిమాండ్లను వారం రోజుల్లోగా అందిస్తామని మాట ఇచ్చారు ఇప్పుడు మూడు నెలలు గడిచిన అందకపోయేసరికి మంత్రి మాట ఎటుపాయే అని రైతులందరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రసాభసగా బిఆర్ఎస్ బీసీ సెల్ సమావేశం...

● నేతల ముందే వర్గ పోరు... తలలు పలిగేలా తన్నుకున్న కార్యకర్తలు...

**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి ఆర్ ఆర్ గార్డెన్ లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బిఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి బిసి సెల్ ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ కార్యకర్తలు తలలు పలిగేలా తన్నుకున్నారు. పార్టీలో అంతర్గత విభేదాలు వర్గపోరు మూలంగా కుర్చీలు విరిగేలా ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దాసోజు శ్రావణ్ కుమార్, మాజీ గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, మాజీ గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ బాలరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరైన ముఖ్య నేతల ముందే మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తమ నాయకులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపిస్తూ ఓదెల మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష వర్గీయులు బీసీ బిడ్డలైన తమ నాయకులను బిఆర్ఎస్ బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆహ్వానించక పోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ నాయకులను నిలదీస్తుండగానే ప్రత్యర్థి వర్గం ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ముఖ్య నేతలు తమ సందేశాన్ని ఇస్తుండగానే దాడులు చేసుకోవడంతో ముఖ్య నేతలు గొడవను సద్దుమణిగేలా ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? దాసరి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి - బిఆర్ఎస్ నాయకురాలు బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష పెద్దపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పదవుల కోసం పాకలాడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని బిఆర్ఎస్ నాయకురాలు బిసి జేఏసీ చైర్మన్ దాసరి ఉష ఆరోపించారు. నిన్న జరిగిన బిఆర్ఎస్ బీసీ సెల్ ముఖ్య నాయకుల సమావేశంలో బీసీ బిడ్డలు తమను ఈ సమావేశానికి ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించినందుకు మనోహర్ రెడ్డి వర్గీయులు కర్రలు, కుర్చీలు, రాడ్లతో బిసి బిడ్డలపై దాడి చేసి రక్తం కార్యాల తలలు పగలగొట్టారని చాలామందికి కాళ్లు చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా మనోహర్ రెడ్డి అంటూ దాసరి ఉష ప్రశ్నించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రానున్న కాలంలో పార్టీలకు అతీతంగా బీసీ బిడ్డలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

# నేడు శంషాబాద్‌లో ఓబీసీ భారీ బహిరంగ సభ

● మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ పిలుపు

**మహేశ్వరం, అక్టోబర్ 03 :** జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో శంషాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ఓబీసీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టేలా మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ ఏర్పాట్లను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఇటీవల నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. సభకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మల్లేష్ యాదవ్ కోరారు. గొల్లపల్లి రోడ్డులో భారీ సభ శంషాబాద్‌లోని గొల్లపల్లి రోడ్డులో నేడు మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మల్లేష్ యాదవ్ తెలిపారు. జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టడం ద్వారా వెనుకబడిన వర్గాల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధికి రూ.168.25 కోట్ల ప్రతిపాదనలు

● చెరువుల పునరుద్ధరణకు రూ.60 కోట్లు.. రహదారి అభివృద్ధికి రూ.97.50 కోట్లు

**మేడ్చల్, అక్టోబర్ 03:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల కల్పన, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పారిశుధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను స్టాండింగ్ కమిటీ పరిశీలించింది. తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ 8వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. బోడుప్పల్ సర్కిల్‌లోని చింతల్ చెరువు పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధికి రూ.20 కోట్ల పరిపాలనా అనుమతుల ప్రతిపాదనను పరిశీలించారు. అలాగే ఘట్‌కేసర్ సర్కిల్‌లోని రాంపల్లి చెరువు పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధికి రూ.40 కోట్ల ప్రతిపాదనను పరిశీలించారు. ఈ రెండు చెరువుల అభివృద్ధికి కలిపి రూ.60 కోట్ల మేర ప్రతిపాదనలు ఉన్నాయి. కుంట్లూర్ పెద్ద చెరువు నుంచి బూదాన్ కాలనీ మీదుగా పసుమాముల చెరువు వరకు ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, కొత్త డ్రైన్ల నిర్మాణం, నాళా అభివృద్ధి ప్రణాళిక, అవసరమైన భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఎస్ఎన్‌డీపీ రెండో దశలో భాగంగా నాసిన్ చెరువు నుంచి కొమటివాని కుంట వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణం, నాళా అభివృద్ధి ప్రణాళిక, భూసేకరణ అంశాలను కూడా పరిశీలించారు. నాగారం డివిజన్‌లో ఏబీసీ, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ, ఎస్సీపీపీటీ, బీటీ ప్లాంట్లకు సంబంధించి ప్రహరీ నిర్మాణానికి రూ.4.95 కోట్లు, ఖాళీ స్థలం నుంచి ఓపెన్ నాలా వరకు భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణానికి రూ.2.95 కోట్ల పరిపాలనా అనుమతుల ప్రతిపాదనలను పరిశీలించారు. ఈ రెండు పనులకు కలిపి రూ.7.90 కోట్లు ప్రతిపాదించారు. పటేల్‌నగర్ ఎస్టీపీ నుంచి డీ-మార్ట్ వరకు 36 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం, విస్తరణకు సంబంధించిన మొదటి దశ పనులకు హెచ్-సిటీ నిధుల కింద 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.97.50 కోట్ల పరిపాలనా అనుమతుల ప్రతిపాదనను కమిటీ పరిశీలించింది. సైనిక్‌పురిలోని ఓపెన్ స్పేస్‌లో డాగ్ పార్క్ అభివృద్ధికి రూ.2.85 కోట్ల పరిపాలనా అనుమతుల ప్రతిపాదనను పరిశీలించారు. బండబావి ప్రాంతంలో బహుళ ప్రయోజనాల బహిరంగ క్రీడా సముదాయం అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చించారు. ఎంఎంసీ పరిధిలో జీవ వైవిధ్య నిర్వహణ కమిటీ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించారు. జీవ వనరుల పరిరక్షణ, సుస్థిర వినియోగం, జీవ వనరుల ద్వారా లభించే ప్రయోజనాల సమాన పంపిణీతోపాటు ప్రజల జీవ వైవిధ్య రిజిస్టర్ తయారీ, నిర్వహణలో ఈ కమిటీ కీలకంగా వ్యవహరించనుంది. ఫతుల్లాగూడ సీ అండ్ డీ ప్రాసెసింగ్ కేంద్రానికి సంబంధించిన అదనపు ఒప్పందం, సైనిక్‌పురిలో ప్రతిపాదిత పెట్ పార్కులో గ్రూమింగ్ పాడ్స్ ప్రయోగాత్మక ప్రాజెక్టు, ఎంఎంసీ కంట్రోల్ రూమ్ నిర్వహణ, ఈపీఎఫ్ఓ చట్టబద్ధ వేతన పరిమితి సవరణ, ప్రభుత్వ భూమి కేటాయింపు, న్యాయ విభాగానికి స్టాండింగ్ కౌన్సిళ్లు, న్యాయ సహాయకుల నియామకం, కొనసాగింపు తదితర అంశాలను కూడా కమిటీ పరిశీలించింది. సమావేశంలో పరిశీలించిన ప్రధాన వ్యయ ప్రతిపాదనల్లో చింతల్ చెరువు పునరుద్ధరణకు రూ.20 కోట్లు, రాంపల్లి చెరువు అభివృద్ధికి రూ.40 కోట్లు, నాగారం డివిజన్ పనులకు రూ.7.90 కోట్లు, సైనిక్‌పురి డాగ్ పార్క్‌కు రూ.2.85 కోట్లు, పటేల్‌నగర్--డీ-మార్ట్ రహదారి అభివృద్ధికి రూ.97.50 కోట్లు ఉన్నాయి. వీటన్నింటినీ కలిపితే రూ.168.25 కోట్లుగా ఉంది. మౌలిక వసతులు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సౌకర్యాల మెరుగుదలతోపాటు సమగ్ర పట్టణ అభివృద్ధికి చర్యలను వేగవంతం చేసే దిశగా సమావేశంలో ప్రతిపాదనలను పరిశీలించారు. సమావేశంలో ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేగోపాల్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, కార్యదర్శి రజినీ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ సునంద, సూపరింటెండింగ్ ఇంజినీర్లు రమేష్‌బాబు, నాగేందర్, రోహిణి, ఎల్ఏఓ సరిత, చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మాధవీలత, రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కిమ్స్ ఆసుపత్రిలో ఉద్రిక్తత

యువకుడి మృతిపై కుటుంబ సభ్యుల ఆందోళన.. రూ.6 లక్షల బిల్లుపై అభ్యంతరం..

**కొంపల్లి, అక్టోబర్ 3, :** కొంపల్లిలోని కిమ్స్ ఆసుపత్రిలో యువకుడి మృతి నేపథ్యంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. జీడిమెట్ల గ్రామానికి చెందిన నూర్ ఆలం (28) జాండీస్ సమస్యతో శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆసుపత్రిలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారని, అనంతరం నూర్ ఆలం మృతి చెందినట్లు ప్రకటించారని వారు పేర్కొన్నారు. ఇదే సమయంలో సుమారు ఆరు గంటల వ్యవధిలో రూ.6 లక్షల బిల్లు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది సూచించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అంత తక్కువ సమయంలో ఇంత భారీగా బిల్లు ఎలా వేశారని ప్రశ్నిస్తూ కుటుంబ సభ్యులు, యువకుడి స్నేహితులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. అధిక బిల్లులపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.. అయితే, యువకుడి మృతికి గల వైద్య కారణాలు, బిల్లుకు సంబంధించిన వివరాలపై ఆసుపత్రి యాజమాన్యం నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# దూలపల్లిలో భూ వివాదం

300 గజాల భూమి ఆక్రమణపై ఫిర్యాదు..

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 3: దూలపల్లి పరిధిలోని సర్వే నంబర్లు 86, 87లో 300 గజాల భూమికి సంబంధించి వివాదం నెలకొంది. తనకు చెందిన భూమిని గడ్డం ప్రసన్నకుమార్ ఆక్రమించారని ఆరోపిస్తూ బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. పోలీసులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**మిర్యాలగూడ:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి గ్రామం, ప్రతి మండలంలో పెద్ద ఎత్తున చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు సూచించారు. మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడుగులపల్లి మండలాలకు సంబంధించిన ఓటరు నమోదు సన్నాహక సమావేశం మిర్యాలగూడలో నిర్వహించగా, భాస్కర్ రావు హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిర్యాలగూడ రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును నమోదు చేసుకోవాలని, ఇతర పట్టభద్రులకు కూడా ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని భాస్కర్ రావు సూచించారు. ప్రతి గ్రామం, మండలంలో నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, ఎండి. యూసుఫ్, చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుర్గంపూడి నారాయణ రెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, ధనావత్ బాలాజీ నాయక్ తదితరులతో పాటు ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఓటరు నమోదు కార్యక్రమం ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలి

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు

**కామారెడ్డి జిల్లా (ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు హ్మని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల నమోదు, జాబితా శుద్ధీకరణ ప్రక్రియలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పౌరులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాను శుద్ధీకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలు, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువతలో అవగాహన పెంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ 78 శాతం పూర్తయినట్లు అధికారులు వివరించారు. పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో ప్రభాకర్, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సరోగసీ దరఖాస్తులపై సమగ్ర పరిశీలన

5 దరఖాస్తుల్లో 3కు ఆమోదం.. వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీ

**మేడ్చల్, అక్టోబర్ 03:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఏఆర్టీ/సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సరోగసీ ప్రక్రియలో వైద్యపరమైన అవసరం, చట్టబద్ధత, పారదర్శకత, నైతిక ప్రమాణాలు, తల్లి--శిశు సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ బోర్డు సరోగసీ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించింది. గర్భధారణకు సంబంధించిన వైద్య సమస్యలు, గర్భస్థ శిశువును మోసే సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిపుణుల అభిప్రాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణులు డాక్టర్ శివ కిరణ్ పాల్గొని వైద్యపరమైన అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో సరోగసీకి సంబంధించిన మొత్తం 5 దరఖాస్తులను బోర్డు పరిశీలించింది. సరోగసీ (నియంత్రణ) చట్టం--2021లోని నిబంధనలు, నిర్దేశిత వైద్య ప్రమాణాలు, దరఖాస్తుదారుల అర్హతలు, సమర్పించిన వైద్య, చట్టపరమైన పత్రాలను పరిశీలించిన అనంతరం 3 దరఖాస్తులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన దరఖాస్తుదారులకు వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. సరోగసీ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని బోర్డు స్పష్టం చేసింది. సరోగసీ ప్రక్రియ ద్వారా తల్లి, శిశువు సంక్షేమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యపరమైన ప్రమాణాలను పాటించాలని సూచించింది. అర్హత కలిగిన దంపతులకు మాత్రమే పూర్తి వైద్యపరమైన, చట్టబద్ధమైన పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని డాక్టర్ ఆనంద్ తెలిపారు. సరోగసీకి సంబంధించిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# విశ్వజి

# షుగర్ కంట్రోల్ చేసే అద్భుత పానీయం ఇదే.. కానీ

భారతదేశంలో డయాబెటిస్ బాధితులు రోజు రోజుకూ పెరిగిపోతున్నారు. డయాబెటిస్ ను నిర్వహించటంలో గ్రీన్ టీ చాలా బాగా ఉపయోగ పడుతుంది. ఈ పానీయం, యాంటీఆక్సిడెంట్లలో సమృద్ధిగా ఉండి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడవచ్చు. గ్రీన్ టీ ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచగలదని చెప్తారు. అంతే కాదు గ్రీన్ టీ మంటను తగ్గించగలదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రీన్ టీ తాగితే ఈ లాభాలు గ్రీన్ టీ మన ఆరోగ్యాన్ని కాపాడే గొప్ప గుణాలతో ఉంటుంది. దీనిలో పాలిఫినాల్స్, ముఖ్యంగా కాటెకిన్స్‌ను కలిగి ఉంటుంది. ఇవి యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ సమ్మేళనాలు ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో బాగా ఉపయోగపడతాయి. గ్రీన్ టీని క్రమం తప్పకుండా తీసుకోవడం గుండె జబ్బు మరియు మధుమేహంతో సంబంధం ఉన్న ఇతర పరిస్థితుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని చెప్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం పరిశోధనలు గ్రీన్ టీ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించగలదని సూచిస్తున్నాయి. గ్రీన్ టీలోని కాటెకిన్లు గ్లూకోజ్ మెటాబోలిజంపై ప్రభావం చూపిస్తాయని చెప్తున్నారు. ఇది మెరుగైన గ్లైసెమిక్ నియంత్రణకు దారితీస్తుంది. ఈ ప్రభావం రక్తంలో చక్కెర స్థాయిలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన టైప్ 2 డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. %ూశీషవతీవస దీఎ% ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడం ఇన్సులిన్ సున్నితత్వం మధుమేహంతో ఉన్నవారికి చాలా అవసరం. గ్రీన్ టీ ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుందని చెప్తారు. శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించడానికి గ్రీన్ టీ సహాయకారిగా మారుతుందని చెప్తారు. ఈ మెరుగుదల రక్త గ్లూకోజ్ స్థాయిలను మెరుగ్గా నిర్వహించడానికి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ అభివృద్ధి చెందే ప్రమాదాన్ని తగ్గించడానికి దారితీస్తుంది. మంటను తగ్గించడం గ్రీన్ టీ యొక్క యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మధుమేహ బాధితులలో వచ్చే నొప్పులు, మంటలు, వాపులను తగ్గిస్తాయి. మంటను తగ్గించడం ద్వారా, గ్రీన్ టీ మధుమేహంతో ఉన్న వ్యక్తులకు మెరుగైన ఆరోగ్య ఫలితాలకు తోడ్పడుతుంది. గ్రీన్ టీ సాధ్యమైన ప్రయోజనాలను అందించినప్పటికీ, అతిగా సేవించటం మాత్రం మంచిది కాదు. డయాబెటిస్ బాధితులకు గ్రీన్ టీ పై పెరుగుతున్న ఆసక్తి గ్రీన్ టీ అయినా ఒక పద్ధతి ప్రకారం మితంగా తీసుకుంటే పరవాలేదు . రోజుకు రెండు నుండి మూడు కప్పులు వరకు తాగొచ్చని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. మధుమేహ నిర్వహణ కోసం సహజ సహాయకుడిగా గ్రీన్ టీ పని చేస్తుందని చాలా మంది భావిస్తున్న క్రమంలో గ్రీన్ టీపై ఆసక్తి పెరుగుతుంది.

## ఈ సీజన్ లో డయాబెటిస్ రోగులకు సూపర్ పండు ఇదే!

నేరేడు పండు.. వర్షాకాలంలో దొరికే అద్భుతమైన పండు. చాలామంది డయాబెటిస్ బాధితులు ఏ పండ్లు తినాలి అని ఆలోచిస్తూ ఉంటారు. వర్షాకాలంలో దొరికే ఈ సీజనల్ పండు డయాబెటిస్ బాధితులకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. నేరేడు పండు తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు నేరేడు పండ్లు మధుమేహాన్ని కంట్రోల్ చేయడంతో పాటు బరువు తగ్గడంలో దోహదం చేస్తాయి. నేరేడు పండ్లలో ఫుల్ పోషకాలు ప్రకృతి సిద్ధంగా లభించే నేరేడు పండ్లు మనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయి. నేరేడు పండులో ఫుల్ గా పోషకాలు ఉంటాయి. నేరేడు పండులో విటమిన్ సి, విటమిన్ బి, క్యాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్ తో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. నేరేడు పండులో పుష్కలంగా ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. డయాబెటిస్ బాధితులకు బెస్ట్ పండ్లు నేరేడు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయం చేస్తుంది. నేరేడు పండు గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే పండు, కాబట్టి ఇది డయాబెటిస్ పేషెంట్స్ కు ఎంతో బాగా పనిచేస్తుంది. అయినప్పటికీ డయాబెటిస్ పేషెంట్స్ నేరేడు పండ్లను కూడా ఎక్కువ తినకూడదు. 10 నుండి 12 పండ్లను మాత్రమే తినాలి. %ూశీషవతీవస దీఎ% నేరేడు పండ్లతో ఆరోగ్యం నేరేడు పండ్లను తినడం వల్ల రక్తంలోని హిమోగ్లోబిన్ సమతుల్యం అవుతుంది. నేరేడు పండ్లలో ఉండే విటమిన్ సి కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మన చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని భావించేవారికి నేరేడు పండ్లు ఒక మంచి ఎంపిక.  నేరేడు పండ్లు ఇలాగే తినాలి నేరేడు పండ్లు మన శరీరంలో వ్యర్థాలను బయటకు పంపించడానికి, కడుపుని శుభ్రం చేయడానికి, జీర్ణశక్తిని మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. అన్నిటికంటే డయాబెటిస్ బాధితులకు ఎంతో బాగా ఉపయోగపడే నేరేడు పండ్లను తినండి అయితే ముఖ్యంగా మితంగా తినాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరు కచ్చితంగా గుర్తు పెట్టుకోండి.

### పరగడుపునే అల్లం రసాన్ని తాగండి-

## డయాబెటిస్, హైబీపీకి చెక్..!!

అల్లం ప్రతీ ఇంటా ఉంటుంది. ఆహార పదార్థాల్లో ఎక్కువగా వినియోగిస్తాం. అల్లం రుచి.. వాసన మాత్రమే కాదు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంకు ఎంతగానో ప్రాము ఖ్యత ఉంది. పలు రకాల ఔషధాల తయారీకి కూడా అల్లాన్ని ఉపయోగిస్తుంటారు. రోజూ ఉదయం పరగడుపునే 1 టీస్పూన్ అల్లం రసం సేవిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అల్లంలో ఉండే అనేక సమ్మేళనాలు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణ వ్యవస్థ మొదలు రక్తపోటు నియంత్రణ వరకు అల్లం మేలు చేస్తుందని చెబుతున్నారు. అల్లంలో ఉన్న ఔషధ గుణాలు పలు రకాల అరోగ్య సమస్యల పరిష్కారినికి మేలు చేస్తాయి. అల్లం రసం తాగడం వల్ల జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. దీంతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అల్లంలో జింజరాల్స్, షోగోల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఆహారం సులభంగా కదిలేలా చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అలాగే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. కడుపు ఉబ్బరం, అజీర్తి, గ్యాస్, పొట్టలో అసౌకర్యం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మెటబాలిజం కూడా పెరుగుతుంది. అధిక బరువు తగ్గటానికి అ్లం దోహదం చేస్తుంది. అల్లం రసాన్ని పరగడుపునే సేవిస్తుంటే అందులో ఉండే యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. %ూశ్రీంశీ =ఝు% 'అన్నదాత సుఖీభవ' అర్హుల జాబితా, వారికే నిధులు- పేరు లేకుంటే ఇలా చేయండి..!! ఆర్థరైటిస్ సమస్యలు ఉన్నవారికి అల్లం రసంతో ఉపశమనం ఉంటుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ సమ్మేళనాలు అధికంగా ఉండడం వల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూ లించి శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్లు, రోగాలకు శరీరం వ్యతిరేకం గా పోరాడుతుంది. అల్లం రసం సేవించడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయో గించుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయ. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ఇక, అల్లం రసం తాగడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలోకి వస్తుంది చెబుతున్నారు. అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీరంలోని అంతర్గత వాపులు తగ్గిపోతాయి. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఇలా అల్లం రసం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు

## ఈ అలవాట్లను మార్చుకోకపోతే.. డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది.

# మార్కెట్

## అమ్మకాల ఒత్తిడికి అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేశారు. ఆయా రంగాల షేర్లను దూరం పెడుతూ కొనుగోళ్లకు అంతగా ఆసక్తి కనబర్చలేదు. విదేశీ ఇన్వెస్టర్లు సైతం పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 626.01 పాయింట్లు లేదా 0.74 శాతం కోల్పోయి 83,432.89 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 176.80 పాయింట్లు లేదా 0.68 శాతం పడిపోయి 25,461 దగ్గర స్థిరపడింది. అయితే రుతు పవనాలు ఇంకా దేశవ్యాప్తంగా విస్తరించకపోవడంతో వ్యవసాయంపై గుబులు పట్టుకుంటున్నది. అలాగే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతుండటం కొంత ఆందోళనకరంగానే ఉన్నదని చెప్పవచ్చు. దీంతో ఇన్వెస్టర్లు ఈ వారం అమ్మకాల ఒత్తిడిలోనే ఉండవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,700-25,900 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..




దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు తెలిపే ఏ దేశానికైనా అదనంగా పదిశాతం టారిఫ్ విధించనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దాంతో రూపాయి విలువ పతనమైంది. సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి 47 పైసలు తగ్గి 85.86 వద్ద ముగిసింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే బెంచ్ మార్క్ సూచీలు సోమవారం ఉదయం 83,398.08 స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,262.23 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 83,516.82 పాయింట్లకు చేరింది. చివరకు 9.61 పాయింట్లు పెరిగి 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 0.30 పాయింట్లు పెరిగి 25,461.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,617 షేర్లు లాభపడగా.. 2,294 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.27 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం క్షీణించింది. ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 1.6శాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.4శాతం లాభపడింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం, ఐటీ, మెటల్ ఇండెక్స్ 0.7శాతం తగ్గాయి. టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఓఎన్‌జీసీ, ఎటర్నల్ నష్టపోగా.. హెచ్‌యూఎల్, టాటా కన్స్యూమర్, నెస్లే ఇండియా, జియో ఫైనాన్షియల్, ఐషర్ మోటార్స్ లాభపడ్డాయి.

## పాన్ కార్డు పోయిందా? చింతించకండి..

### నిమిషాల్లో డూప్లికేట్ కోసం అప్లై చేయండి ఇలా!

పాన్ కార్డు పోగొట్టుకోవడం లేదా దొంగిలించబడటం అనేది ఈ రోజుల్లో చాలా సాధారణం అయిపోయింది. ఎన్నో ముఖ్యమైన పత్రాలతో పాటు పాన్ కార్డును కూడా ఎక్కడో పెట్టి మర్చిపోవడం లేదా అనుకోకుండా పోగొట్టుకోవడం సహజంగా జరుతుంది. కానీ పాన్ కార్డు లేకపోతే అనేక పనులు ఆగిపోతాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాల్లో చాలా చిక్కులు ఎదురవుతాయి. అయితే మీరు అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! పోగొట్టుకున్న పాన్ కార్డును తిరిగి పొందడం ఇప్పుడు చాలా సులభం. మీరు ఇంట్లో కూర్చొనే ఆన్‌లైన్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ ముక్క మాత్రమే కాదు, అది మీ గుర్తింపుకు చిహ్నం. ఈ రోజుల్లో పాన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా మారిపోయింది. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ఇంకా మరెన్నో ముఖ్యమైన పనులకు పాన్ కార్డు తప్పనిసరి. ఒకవేళ మీ పాన్ కార్డు పోతే, మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, పాన్ కార్డు పోగొట్టుకున్న వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు డూప్లికేట్ పాన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందాం రండి.. డూప్లికేట్ పాన్ కార్డు కోసం



దరఖాస్తు చేసుకునే విధానం: అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: మొదటగా మీరు  (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్) అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. వెబ్‌సైట్ చిరునామాను గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు లేదా నేరుగా వెబ్‌సైట్‌కు వెళ్లడానికి ప్రయత్నించవచ్చు. వివరాలను నమోదు చేయండి: వెబ్‌సైట్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విభాగానికి వెళ్లండి. అక్కడ మీరు మీ పాన్ కార్డు నంబర్ (గుర్తుంటే), మీ 10 అంకెల ఆధార్ నంబర్ మరియు, మీ పుట్టిన తేదీని నమోదు చేయాలి. మీరు ఈ వివరాలను జాగ్రత్తగా , సరిగ్గా నమోదు చేయాలి.

# వైసీపీ ఓటు షేరు ఎందుకు తగ్గింది

విజయవాడ, అక్టోబరు 3 : ఏపీలో స్థానిక ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. సీట్ల సర్దుబాటు.. ఇతర వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. సహజంగా కూటమిలో పోటీ అధికంగా ఉంది. వైసీపీలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వాదనలు ఉన్నాయి. ఇలా సాగుతున్న రాజకీయ వ్యవహారంలో చాణక్య సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం 2024 తర్వాత 4.37 ఓట్ షేర్ ను వైసిపి కోల్పోయింది.. టిడిపి తో పోల్చితే దాదాపు 11.90 శాతం తేడా ఓటు బ్యాంకు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలలో లోకేష్ టాప్ లో ఉన్నారు. 175 నియోజకవర్గాలలో 52, 500 మంది ఓటర్లను పరిశీలించారు. రెండు నెలలపాటు సర్వే నిర్వహించారు. అయితే కూటమి బలం తగ్గడం కాదు కదా.. భారీగా పెరిగింది. 2024 లో జరిగిన ఎన్నికలతో పోల్చి చూస్తే చాణక్య సర్వే చెప్పిన దాని ప్రకారం చూస్తే.. టిడిపి ఓటు బ్యాంకు 45. 60% నుంచి 46.90 శాతానికి పెరిగింది. మొత్తంగా ఓటు బ్యాంకు 1.30 శాతానికి పెరిగింది. వైసీపీకి 2024 ఎన్నికల్లో 39.37 ఓటు బ్యాంకు లభించింది. ఇప్పటికి అది 35% పడిపోయింది. జనసేనకు నాడు ఓటు బ్యాంకు 8.53 శాతం గా ఉంది. ఇప్పుడు అది తొమ్మిది శాతానికి చేరుకుంది. మొత్తంగా 0.47 ఓటు శాతం పెరిగింది. బిజెపికి 2.83 శాతం ఉండగా.. ఇప్పుడు అది 3.5 జీరోకి జరిగింది. మొత్తంగా 0.67 శాతం ఓటు బ్యాంకు పెరిగింది. ఇక ఇతరులు 3.67 నుంచి 5.60 వరకు శాతాన్ని పెంచుకున్నారు. మొత్తంగా మూడు పార్టీల ఓటు షేర్ దాదాపు 57% నుంచి 59.4 శాతానికి చేరుకుంది. అధికారులకు వచ్చిన తర్వాత ఓటు బదిలీ మరింత బలపడింది. 4.37 పాయింట్ల ఫలితమే ఈ సర్వేలో అతిపెద్ద మార్పు. ఓటు షేర్ 35% పడిపోయింది. రఫ్పా రఫ్పా నినాదాలు మాత్రమే చెబుతున్న వైసిపి నాయకులు.. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య ఎదురయిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పకడ్బందీగా వ్యవహరించకపోతే 35 శాతం ఓటు బ్యాంక్ కూడా తగ్గిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ



గణాంకాలు చూస్తే వైసిపి కోల్పోవడం కష్టంగానే కనిపిస్తోంది. వైసిపి కోల్పోయిన ఓట్లలో కొంత భాగం ఇతరుల వైపు వెళ్ళింది. అటు కూటమి.. ఇటు వైసీపీ మీద అసంతృప్తితో ఉన్నవారు కాంగ్రెస్ లాంటి ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఎమ్మెల్యేలలో లోకేష్.. కోటం.. పవన్ కళ్యాణ్ వరుసగా టాప్ మూడు స్థానాలలో ఉన్నారు. ఇక వైసిపి ఎమ్మెల్యేలలో చివరికి జగన్ తో ఎవరూ పెద్దగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన తర్వాత మాత్రమే జగన్ పులివెందులలో హడావిడి చేస్తున్నారని.. ఆ తర్వాత జనాల బాధలను పట్టించుకునేవారు లేరని సర్వేలో తేలింది. మంత్రులుగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పిఠాపురం విషయంలో.. లోకేష్ మంగళగిరి విషయంలో మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. చంద్రబాబు అయితే కుప్పం విషయంలో వారానికి రెండు రోజులు సమయం కేటాయిస్తున్నారని.. ముఖ్యమంత్రిగా ప్రతిరోజు కుప్పం వెళ్లడం సాధ్యం కాదు కాబట్టి.. ఆయన నియమించుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం విషయంలో చంద్రబాబు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. అందువల్లే ఆయన పనితీరు కూడా అద్భుతంగా ఉందని ఈ సర్వేలో తేలింది. రాజకీయాల్లోకి కేకే దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా చిత్రవిచిత్రమైన నంబర్లతో, సర్వేల పేరుతో సోషల్ మీడియాలో విపరీతమైన హంగామా సృష్టించిన కేకే సర్వేస్ అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు నేరుగా రాజకీయ రంగప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల లెక్కలంటూ గాల్లో మేడలు కట్టిన ఆయన.. ఇప్పుడు నేరుగా రాజకీయ రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన ప్రజలను కుల, మత, జాతి విభేదాలు లేకుండా ప్రోత్సహించడానికే ఏకం అనే ప్లాట్‌ఫామ్‌ను తీసుకొస్తున్నామని ప్రకటించారు. పంచాయతీ, మండల పరిషత్ నుంచి మొదలుపెట్టి రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ వంటి అన్ని రకాల ఎన్నికల్లోనూ ఈ వేదిక తరపున అభ్యర్థులను నిలబెడతామంటూ విజయవాడ స్టార్ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. గతంలో ఏదో ఒక ఎన్నికల ఫలితాన్ని అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చినప్పటికీ.. ఆ తర్వాత ఆ క్రెడిబిలిటీని సోషల్ మీడియాలో, పొలిటికల్ సర్కిల్స్‌లో క్యాష్ చేసుకునేందుకు ఆయన పడ్డ పాట్లు అందరికీ తెలిసిందే. సర్వే నంబర్ల పేరుతో పక్కా సైంటిఫిక్ స్టడీలని నమ్మబలుకుతూ ఇచ్చిన లెక్కలు పలుమార్లు తలకిందులై తీవ్ర ఎదురుదెబ్బలు తగిలాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంతోనే ఆయన మరో ఆరా మస్తాన్ అని అందరికీ క్లారిటీ వచ్చేసింది. సొంత విశ్వసనీయతపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తడంతో, ఇక సర్వేల పేరుతో విశ్లేషణలు చెబితే ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరనే వాస్తవాన్ని గుర్తించే.. ఈసారి డైరెక్ట్‌గా తానే ఒక పార్టీ లేదా రాజకీయ వేదికను తెరపైకి తెస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూపు తగాదాలు, భారీ ఆర్థిక వనరులు, బలమైన కేడర్‌తో ముడిపడి ఉండే వ్యవహారం. అలాంటి చోట కేవలం ఏకం అనే ఒక వేదికను సృష్టించి, ఆసక్తి ఉన్న వారికి టికెట్లు ఇస్తామంటే గ్రామాల్లో ఓట్లు రాలతాయా అన్నది కనీస ప్రశ్న. సర్వేల పేరిట ప్రశంసలు, విమర్శలు పొందినంత తేలికగా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి నెగ్గుకురావడం సాధ్యం కాదన్నది బహిరంగ సత్యం. ఎంతకాలమని సర్వేల సోది చెబుతూ ప్రజలను మభ్యపెడతాం.. మనమే ఓ ప్లాట్‌ఫామ్ పెట్టి రాజకీయం నడిపిస్తే పోలా అన్న ఆలోచన నుంచే ఈ ఏకం పుట్టుకొచ్చిందని అర్థం చేసుకోవచ్చు. సర్వేల విశ్వసనీయత కోల్పోయిన తర్వాత రాజకీయంగా ఉనికిని చాటుకోవడానికి వేసిన ఈ కొత్త ఎత్తుగడ ఏ మేరకు నిలబడుతుందో చూడాలి.

# విజయనగరం జిల్లాలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ

### పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

### జగన్ ఒక నియంత అంటూ తీవ్ర వ్యాఖ్యలు

విజయనగరం : జిల్లాలో వైసీపీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో వైసీపీ అధిష్ఠానం ఆయన్ను నిన్న సస్పెండ్ చేయగా, ఆ మరుసటి రోజే ఆయన పార్టీని వీడటం గమనార్హం. విజయనగరంలో మీడియా సమావేశంలో మాట్లాడిన అప్పలనాయుడు... పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జగన్‌ను ఒక 'నియంత'గా అభివర్ణించిన ఆయన... వైసీపీ ఒక లిమిటెడ్ కంపెనీగా మారిపోయిందని ఆరోపించారు. గౌరవం లేని చోట తాను, తన అనుచరులు ఇకపై కొనసాగలేమని స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు, చంద్రబాబు ఎలాగూ ఓడిపోతారన్న జగన్ అతివిశ్వాసమే పార్టీ ఘోర పరాజయానికి కారణమని విశ్లేషించారు. పార్టీలో క్రమశిక్షణ కమిటీ అనేది ఒకటుందా? అని ప్రశ్నించిన అప్పలనాయుడు... నేతలు తమ సొంత సంస్థలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను నమ్మి వేలాది కుటుంబాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన బంధువైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను సస్పెండ్ చేసినప్పుడు, ఆయనకు మరో బంధువైన బొత్స సత్యనారాయణపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఇటీవల చిన్న శ్రీను, ఆయన కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు పలువురు స్థానిక నేతలు, జడ్పీటీసీలు కూడా వైసీపీని వీడారు. చిన్న శ్రీనుకు అత్యంత సన్నిహితుడైన బడ్డుకొండ కూడా ఇప్పుడు పార్టీ నుంచి నిష్క్రమించడంతో, ఒకప్పుడు బొత్స కుటుంబానికి కంచుకోటగా ఉన్న విజయనగరం జిల్లాలో వైసీపీ బలం గణనీయంగా క్షీణిస్తోందన్న చర్చ జరుగుతోంది.

## అమెరికాలో విషాదం.. అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## చిత్రలేఖనంలో జీవన్ దుర్గేంద్రకు తృతీయ బహుమతి

### వక్తృత్వ పోటీలో సత్య వరలక్ష్మికి ప్రథమ బహుమతి

రాజవొమ్మంగి సేవా సంకల్ప్ అభియాన్ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న జిల్లా స్థాయి చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. 8వ తరగతి విద్యార్థిని సత్య వరలక్ష్మి వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించింది. 7వ తరగతి విద్యార్థి బి. జీవన్ దుర్గేంద్ర చిత్రలేఖన పోటీలో తృతీయ బహుమతి సాధించాడు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలో బహుమతి సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ శివకృష్ణ, పీఎంసీ ఛైర్మన్ బి. శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండబాబు, సత్యబాబు, స్వామి, జయలక్ష్మి పాల్గొన్నారు.

# పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

### 'స్పెషల్ క్యాంపెయిన్-6 లో జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు?

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శనివారం రోజున మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన "స్పెషల్ క్యాంపెయిన్ - 6 " స్వచ్ఛ-స్వచ్ఛ భారత్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా జీఎం గారు మాట్లాడుతూ, పూజ్య బాపూజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "గాంధీజీ కేవలం రాజకీయ స్వతంత్ర భారతమే కాకుండా, పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు. పరిసరాల అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలుతాయని, ఇది మన ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి మన ఇల్లు, పరిసరాలు, మరియు పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు. కార్యాలయాలు, గనులు మరియు పని ప్రాంతాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగవుతాయని ఆయన తెలిపారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను ఒక నిత్యకృత్యంగా మలుచుకుని, స్వచ్ఛమైన వాతావరణంలో "రక్షణతో కూడిన ఉత్పత్తి" కూడా సాధించవచ్చని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ-స్వచ్ఛభారత్ (స్పెషల్ క్యాంపెయిన్-6) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి.ఎల్. ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఎన్విరాన్మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పి ఓ, ఎం.కార్తీక్, ఏఐటియుసి, జి ఎం ,స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సి.వి.రమణ, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక మరియు జిఎం ఆఫీస్ ఉన్నత అధికారులు, అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# మీా వెన్నంటి భారత్ ఉంది

### అమెరికాలో ప్రవాసులకు పీయూష్ గోయల్ భరోసా

### ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులకు దేశం అండగా నిలుస్తుందన్న మంత్రి

### యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాలను ఉదహరించిన కేంద్ర మంత్రి

### గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో ప్రవాసులతో సమావేశం

షికాగో : పపంచంలో ఏ మూలన ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు తమ దేశం అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. "మీా వెన్నంటి భారత్ ఉంది" అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన ఆయన, స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో మాట్లాడారు. గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లోని భారతీయుల భద్రత కోసం ప్రభుత్వం ఎంతగా తపించిందో ఆయన గుర్తుచేశారు. "మీరు ఏ దేశంలో, ఏ పరిస్థితుల్లో ఉన్నా మీ మాతృభూమి మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబాలకు, మీ పిల్లలకు తోడుగా నిలుస్తుంది" అని గోయల్ స్పష్టం చేశారు. అమెరికా, భారత్ మధ్య ప్రవాస భారతీయులు ఒక జీవ వారధిలాంటి వారని గోయల్ అభివర్ణించారు. "మీలో ప్రతి ఒక్కరూ అమెరికాలో భారత రాయబారులే" అని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు తాము స్వీకరించిన దేశానికి (అమెరికాకు) నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు. అదే సమయంలో, తమ మాతృభూమిని, ఇక్కడి ప్రజలను తమ హృదయంలో పదిలంగా ఉంచుకోవాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా, 1893లో స్వామి వివేకానంద చరిత్రాత్మక ప్రసంగం చేసిన ఫుల్లర్టన్ హాల్‌ను కూడా ఆయన సందర్శించారు.

# పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి

### బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

### వరంగల్ సెంట్రల్ లైబ్రరీని సందర్శించి విద్యార్థులకు విజ్ఞప్తి

హనుమకొండ, అక్టోబర్ 3, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శనివారం వరంగల్ సెంట్రల్ లైబ్రరీని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి సందర్శించారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఎన్నికలతో పోలిస్తే చాలా భిన్నమైనదని, ఇందులో ఉన్నత విద్యావంతులు, మేధావులు, సమాజం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవారే ఓటు వేస్తారని అన్నారు. కాబట్టి ఇచ్చే తీర్పుకు ఎంతో విలువుంటుందని, నిరంతరం తమ కోసం పోరాడుతున్న వారికే మద్దతుగా నిలవాలని, ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి హడావుడి చేసి మొహం చాటేసే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మూడేళ్లు కావస్తున్నా 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం వికసించకుండానే వాడిపోయిందని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేట్ రంగంలో తెలంగాణ యువతకు 75 శాతం ఉద్యోగాల హామీ, నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్ మెంట్, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్ హామీలన్నీ తుంగలో తొక్కారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రతీ పట్టభద్రుడు, నిరుద్యోగ యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా తమ పక్షాన నిలబడి కొట్లాడుతున్న తనకు, బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని, జీవో 46 రద్దు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిన విషయం, జీవో 29 రద్దు కోసం పోరాడిన అంశాలను గుర్తు చేశారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

### బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబర్ 03 : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## కరెంట్ కోసం రామాయంపేటలో రైతుల రాస్తారోకో..

### రెండు గంటలు స్తంభించిన ట్రాఫిక్

రామాయంపేట : వసాయానికి కనీసం 8 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రామాయంపేట?ఎల్కతుర్తి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 8 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు అక్కడకు చేరుకుని రైతులను సముదాయించి, ఆందోళనను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్ పునరుద్ధరించారు.

## అమెరికాలో విషాదం.. అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన వికారబాద్ : మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తునారు.

## 10శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్త్కేర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## నడవలేని స్థితిలో సీనియర్ నటి శారద?

సీనియర్ నటి శారద గురించి తెలుగు ఆడియెన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. వందలాది సినిమాల్లో నటించి మెప్పించిన ఆమె . తన నటనా ప్రతిభకు ప్రతీకగా ఏకంగా జాతీయ ఉత్తమ నటి అవార్డు కూడా అందుకున్నారు. మొదట హీరోయిన్ గా నటించిన శారద ఆ తర్వాత క్రమంగా సహాయక నటిగా మారిపోయారు. కేవలం తెలుగులోనే కాదు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించి మెప్పించారు శారద. మూడుసార్లు జాతీయ ఉత్తమ నటి అవార్డులు, రెండు సార్లు ఫిలిం ఫేర్ అవార్డులు.. ఇలా శారద కీర్తి కిరీటంలో ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, ప్రశంసలు ఉన్నాయి.1955లో వచ్చిన 'కన్యా శుల్కం' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు శారద. ఆ తర్వాత ఇద్దరు మిత్రులు, బలిపీఠం, శారద, దాన వీర శూర కర్ణ, తెనాలి రామకృష్ణ, స్వయంవరం ,నిమజ్జనం , ఊర్వశి, ఇంద్ర ధనుస్సు, ప్రతిధ్వని, జస్టిస్ చౌదరి, అత్తా కోడళ్లు, సర్దార్ పాపారాయుడు, అమ్మ రాజీనామా, ఏవండి ఆవిడ వచ్చింది, మేజర్ చంద్రకాంత్, అంతఃపురం, స్టాలిన్, యోగి, సుకుమారుడు.. ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో శారద నటించారు. కాగా ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు శారద. చివరిగా 2013లో సుకుమారుడు అనే సినిమాలో కనిపించారామె. ఈ మధ్యన పెద్దగా బయట కనిపించని ఆమె తాజాగా చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే ఈ ఈవెంట్ లో ఆమె సరిగ్గా నడవలేని పరిస్థితిలో కనిపించారు. ఈ ఈవెంట్ లో పక్కనున్న వారి సహాయంతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు శారద. ప్రస్తుతం ఈ సీనియర్ నటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఆరోగ్యం పరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శారద వయసు సుమారు 80 ఏళ్లు. ప్రస్తుతం ఆమె ఎక్కువగా ఇంట్లోనే ఉంటున్నారు. కాగా శారద రెండు సార్లు పెళ్లి చేసుకున్నారు అయినా పిల్లలు లేకపోవడంతో ప్రస్తుతం చెన్నైలోని తన సోదరుడి కుటుంబంతో కలిసి జీవిస్తున్నారీ సీనియర్ నటి.



## ఇరుముడి తర్వాత మరో డిఫరెంట్ మూవీ

మాస్ మహారాజా రవితేజ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తనదైన ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే ఆయన.. ఇటీవల ఇరుముడి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా రూ.250 కోట్లకు పైగా వసూళ్లతో సత్తా చాటింది. ఓటీటీలో కూడా దుమ్మురేపుతోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన గ్లోబల్ టాప్-10 నాన్-ఇంగ్లీష్ సినిమాల జాబితాలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇలాంటి భారీ విజయాన్ని అందుకున్న రవితేజ నెక్స్ట్ మూవీ ఏంటి? ఎలాంటి కథను ఎంచుకోబోతున్నారు? అనే ఆసక్తి అభిమానుల్లో మొదలైంది. రవితేజ నెక్స్ట్ మూవీని దర్శకుడు వివేక్ ఆత్రేయతో చేయబోతున్నారట. మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి, సరిపోదా శనివారం వంటి సినిమాలతో వివేక్ ఆత్రేయ తనదైన మేకింగ్ స్టైల్‌ను చూపించారు. కామెడీ, ఎమోషన్, థ్రిల్ అంశాలను డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో కలిపి చెప్పడం ఆయన శైలి. ఇప్పుడు రవితేజతో చేయబోయే సినిమాలోనూ అదే తరహా కొత్తదనాన్ని చూపించేందుకు ప్రయత్ని స్తున్నారట. ఈ ప్రాజెక్ట్‌ను సాధారణ మాస్ యాక్షన్ మూవీకి భిన్నంగా హారర్ కామెడీ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రవితేజ ఇప్పటివరకు కామెడీ, యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్ సినిమాల్లో తన ఎనర్జీతో ఆకట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక సినిమా టైటిల్ పై కూడా చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు 'తులాభారం' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారట. అచ్చ తెలుగు పదంతో ఉన్న ఈ టైటిల్ వినడానికి చాలా డిఫరెంట్‌గా ఉండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. అయితే 'తులాభారం' టైటిల్‌ను చిత్రబృందం అధికారికంగా ఖరారు చేసిందా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వివేక్ ఆత్రేయ గత సినిమాల టైటిల్స్ కూడా కథకు డిఫరెంట్ గుర్తింపును తీసుకొచ్చాయి. ఇప్పుడు రవితేజ లాంటి మాస్ హీరో సినిమాకు 'తులాభారం' అనే టైటిల్ పెట్టడం వెనుక కథలో ఏదైనా స్పెషల్ కాన్సెప్ట్ ఉందా? అనే చర్చ మొదలైంది. ఫిల్మ్ నగర్ వర్గాల టాక్ ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే దసరా సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. నిర్మాణ సంస్థ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, షూటింగ్ షెడ్యూల్ వంటి వివరాలపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

## ఓటీటీలో ట్రెండ్ అవుతోన్న రేణూ దేశాయ్ 'కాశీ మజిలీ'

సాధారణంగా కాశీ వెళ్లొచ్చిన వాళ్లు.. "కాశీలో అది వదిలిపెట్టాం, ఇది వదిలిపెట్టాం" అని చెబుతుంటారు. కానీ దర్శకుడు యమునా కిశోర్ గారు కాశీని చూసిన కోణం చాలా లోతైనది. "కాశీ మన నుంచి ఏమీ తీసుకోదు.. మన గుండెల్లో ఉన్న బాధను మాత్రమే తీసుకుంటుంది, తిరిగి మనకు స్వచ్ఛమైన సంతోషాన్ని ఇస్తుంది" అనే ఒక అద్భుతమైన తాత్విక థీమ్‌తో ఆయన కాశీ మజిలీ సినిమాను మలిచారు. మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ గొప్ప ఆలోచనే నేడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. తన 'డ్రీమ్ మర్చంట్స్' సంస్థ ద్వారా ఇప్పటివరకు 600కు పైగా అడ్వర్టైజ్‌మెంట్‌లను (యాడ్ ఫిల్మ్స్) రూపొందించిన అపారమైన అనుభవం దర్శకుడు డి. యమునా కిశోర్ గారి సొంతం. నిరంతరం గ్లామర్, హంగులతో కలర్‌ఫుల్‌గా ఉండే ఆ యాడ్ ప్రపంచం నుంచి కాసేపు బయటికి వచ్చి.. పూర్తిగా ఆధ్యాత్మిక వాసనలు గుబాళించేలా, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా తీయడం ఆయనలోని అసలైన సృజనాత్మకతకు, వైవిధ్యానికి నిదర్శనం. రేణు దేశాయ్, శంకర్ ఇందుచూడన్ ప్రధాన పాత్రల్లో సహజమైన నటనతో ఆకట్టుకున్న ఈ సినిమా కోసం, దివంగత మహాకవి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన ఒక అపురూపమైన పాటను ఉపయోగించారు. కథలోని ఆత్మను ప్రేక్షకుడి గుండెల్లోకి చేర్చడానికి సిరివెన్నెల గారి సాహిత్యాన్ని ఎంచుకోవడం, దానికి డా. జోశ్యభట్ల గారి సంగీతాన్ని జోడించడం యమునా కిశోర్ గారి ఉన్నతమైన సాహితీ, సంగీత అభిరుచికి అద్దం పడుతోంది. అద్భుతమైన కాశీ అందాలు, వాటిని తెరపై ఆవిష్కరించిన యమునా కిశోర్ గారి టేకింగ్, విభిన్నమైన ఒక ప్రేమ కథకు కాశీ ఆధ్యాత్మికతను జోడించిన తీరు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ప్రతి ఫ్రేములోనూ కనిపించే యమునా కిశోర్ గారి తాలూకు విజువల్ ఆస్థటిక్స్ , ఫ్రేము ఫ్రేములోనూ తొణికిసలాడే ఆధ్యాత్మికత ఈ చిత్రాన్ని ఒక దృశ్యకావ్యంలా నిలబెట్టాయి. కళ్యూరి జగదీష్ కుమార్ నిర్మాణంలో, రాణా ఛాయాగ్రహణం, మీర్ కూర్పు తోడవ్వగా.. దర్శకుడు డి. యమునా కిశోర్ గారి బహుముఖ ప్రజ్ఞకు, ఆయన క్రియేటివ్ విజన్‌కు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఈ 'కాశీ మజిలీ' ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ ఇంటర్నెట్‌లో హల్చల్ చేస్తోంది.

## అక్టోబర్ 5న 'జైలర్ 2' ట్రైలర్

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## వరుణ్ సందేశ్, శ్వేతా బసు 'నా వైఫ్ మిస్సింగ్'..

'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056